**నేటి కందం-నేటికి అందం**

సరిచూచుకొనుచు కేంద్రము
వరము నొసంగిన పగిదిన వాణిజ్య సిలిం
దరుపై ధర తగ్గించెను
పరవశము నొసంగబూని ప్రజలందరికిన్ !!
(మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ల ధరను తగ్గించింది. దీని వలన ప్రత్యక్షంగా హోటళ్ళకు పరోక్షంగా సామాన్య ప్రజలకు మేలు జరుగుతుంది.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

అయోధ్య రామాలయ
అవినీతి చోర దందా
ప్రజల భక్తి నమ్మకాన్ని
పెడుతుంది తప్పి బొంద
దేవుడేమి చేయడనే
దుర్బుద్ధికి రెక్కలు
చూస్తున్నది డబలింజన్
సర్కారు దిక్కులు
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 3-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:256 పేజీలు:6 వెల: రూ.1/-


# ముంబైలో భారీ వర్షాలు.. మ్యాన్‌హోల్‌లో పడి ఒకరి మృతి.. వర్షాలతో ఇది మూడో మరణం



ముంబై జులై 2:మహారాష్ట్ర రాజధాని ముంబైని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. తాజాగా ముంబైలో భారీ వర్షం కారణంగా ఒక వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ముంబైలోని చండివలి ఏరియాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చండివలి, సన్మాన్ హోటల్ సమీపంలోని ఖైరాని రోడ్డులో మెయింటెనెన్స్ వర్క్ జరుగుతోంది. ఈ క్రమంలో అక్కడ అస్లాం ఇసాక్ షేక్ (60) అనే వృద్ధుడు ఫోన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు.

దీంతో అతడు ఆ మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు, అధికారులు అక్కడికి చేరుకున్నారు. దర్యాప్తు జరుపుతున్నారు. అతడి మృతదేహాన్ని వెలికితీసేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. మ్యాన్‌హోల్‌లోకి నిచ్చెన వేసి అతడి కోసం గాలించారు. కానీ, అతడి గొడుగు, చెప్పులు మాత్రమే కనిపించాయి. మ్యాన్‌హోల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల అతడు ఎటువైపు కొట్టుకుపోయాడో కచ్చితంగా చెప్పడం కష్టమని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు అన్నారు. అతడిని గుర్తించడం కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల వర్షాల కారణంగా ముంబైలో సంభవించిన మూడో మరణం ఇది.ముంబై, చెంబూర్‌లోని ఒక స్కూల్ బస్సుపై చెట్టు పడటంతో 11 ఏళ్ల బాలుడు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మరికొందరు విద్యార్థులు గాయపడ్డారు. ఒక బిల్డింగ్ మూడో ఫ్లోర్ బాల్కనీ కూలిన ఘటనలో 51 ఏళ్ల మరో వ్యక్తి మరణించాడు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కొద్ది రోజులుగా ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో కొన్ని చోట్ల 200 మి.మీ.వర్షపాతం నమోదైంది. అనేక చోట్ల నీళ్లు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ముంబైలో శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# సీనియర్ నేత మనీశ్ తివారీని పక్కన పెట్టిన కాంగ్రెస్!

న్యూ ఢిల్లీ, జులై 2:వచ్చే ఏడాది ఎన్నికలకు సిద్ధం అవుతున్న పంజాబ్ కాంగ్రెస్ ఈ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల కమిటీల బాధ్యతలను పలువురు నేతలకు అప్పగించింది. అయితే, సీనియర్ నేత, ఎంపీ మనీశ్ తివారీకి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడం రాష్ట్రంలో చర్చకు దారి తీసింది. ఈ విషయంపై మనీశ్ తివారీ ఎక్స్ వేదికగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

'అసలు నైపుణ్యాలు ఉండటమే ఒక పెద్ద తప్పు లాగా ఉంది. జనాల అభద్రతా భావాలను తొలగించే మార్గం నాకు తెలిసుంటే బాగుండేది. కాంగ్రెస్ నాకు గత 45 ఏళ్లల్లో ఎన్నో అవకాశాలు ఇచ్చింది. నేనూ నా జీవితాన్ని పార్టీకి అంకితం చేశాను. కానీ జీవితంలో ఏది రాసిపెట్టి ఉందో అదే జరుగుతుంది' అని ఆయన ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అయితే, మనీశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న చండీగఢ్ రాష్ట్రం పరిధిలోకి రాకపోవడంతో ఆయనకు ఎన్నికల బృందంలో చోటు దక్కలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

తివారీ గతంలో లూధియానా, ఆనంద్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు.

ఇక గురువారం కాంగ్రెస్ పలు ఎన్నికల కమిటీలకు ఛైర్‌పర్సన్‌లను ప్రకటించింది. ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను కూడా నియమించింది. తివారీకి మాత్రం ఎలాంటి ఎన్నికల బాధ్యతలు దక్కలేదు.

ఇక, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమరీందర్ సింగ్‌ను కొనసాగించడంపై చరణజీత్ సింగ్ ఛన్నీ వంటి సీనియర్ నేతలు పలువురు అసంతృప్తితో ఉన్నట్టు కూడా తెలుస్తోంది.

ఈసారి ఎన్నికల ప్రచార కమిటీకి చరణ్‌జీత్ సింగ్ ఛన్నీ నేతృత్వం వహిస్తున్నారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ కోఆర్డినేషన్ కమిటీకి విజయ్ ఇందర్ సింఘ్లా నాయకత్వం వహిస్తున్నారు.

# బెంగళూరులో దారుణం.. క్వారీలో రాళ్లుపడి ఏడుగురు కూలీలు దుర్మరణం



బెంగళూరు జులై 2: కర్ణాటకలోని బెంగళూరు పరిధిలో దారుణం జరిగింది. ఒక రాళ్ల క్వారీలో పెద్ద రాళ్లు మీద పడటంతో ఏడుగురు కూలీలు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన బెంగళూరు, దక్షిణ తాలూకా, మదపట్టణ వద్ద గురువారం వేకువఝామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న ఒక క్వారీ వద్ద గురువారం ఉదయం ఎప్పట్లాగే పనులు జరుగుతున్నాయి. ఇక్కడ కావేరీ సంస్థకు చెందిన దాదాపు 15-20 మంది కూలీలు పని చేస్తున్నారు. ఈ కూలీలంతా బిహార్‌కు చెందిన వారే. గురువారం ఈ ప్రాంతంలో క్వారీ పనులు జరుగుతున్నాయి.

ఈ క్రమంలో కొందరు కూలీలు బండతో నిర్మితమైన చిన్న పర్వతం దిగువ భాగంలో పనులు చేస్తున్నారు. ఈ పర్వతంపైన హిటాచి మెషీన్‌తో తవ్వకాలు, ఇతర పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పర్వతంపై పెద్ద బండలను మెషీన్‌తో తొలగించేందుకు ప్రయత్నించగా, పైనుంచి ఆ బండలు కింద ఉన్న కార్మికులపై పడ్డాయి. వంద అడుగుల ఎత్తు నుంచి రాళ్లు మీద పడటంతో పర్వతం దిగువ భాగంలో పని చేస్తున్న కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఏడుగురు కూలీలు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ప్రమాద స్థలంలో కూలీలపై పెద్దపెద్ద బండరాళ్లు పడి ఉన్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రాంతం మొత్తాన్ని అధికారుల అధీనంలోకి తీసుకున్నారు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా కూలీలు ఉన్నారా అనే కోణంలో వెతుకుతున్నారు.

పర్వతంపైన హిటాచీతో పనులు జరగడం.. ఈ పర్వతం దిగువన కూలీలు పనిచేస్తున్న విషయాన్ని పైన ఉన్న హిటాచీ ఆపరేటర్ గుర్తించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. మృతుల కుటుంబాలను సంప్రదిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బిహార్ కూలీలు బెంగళూరు పరిధిలో మరణించడంపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ స్పందించారు.

ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్వారీలలో కూలీలకు యాజమాన్యాలు భద్రత కల్పించాలని సూచించారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మూడో విడత రైతు భరోసా నిధులు విడుదల

హైదరాబాద్, జులై 2: తెలంగాణ ప్రభుత్వం రైతులకు మరోసారి శుభవార్త చెప్పింది. రైతు భరోసా పథకం కింద మూడో విడత నిధులను విడుదల చేసింది. 3 నుంచి 4 ఎకరాల భూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.1,330 కోట్లను జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 6.39 లక్షల మంది రైతులు లబ్ధి పొందగా, ఇప్పటివరకు మొత్తం 61.35 లక్షల మంది రైతులకు రూ.5,402.37 కోట్ల రైతు భరోసా సాయాన్ని ప్రభుత్వం అందించినట్లు మంత్రి తెలిపారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, సాగు ఖర్చులను తగ్గించడం, రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే రైతు భరోసా పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని మంత్రి తుమ్మల అన్నారు.

# మొదలైన అమర్‌నాథ్ యాత్ర.. తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం!




న్యూ ఢిల్లీ, జులై 2: హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి.

అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్.

పటిష్టమైన భద్రత - విస్తృత ఏర్పాట్లు

ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ , ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ, రాఆఖీఈ, ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

# ప్రయోగానికి విక్రమ్-1 రాకెట్ సిద్ధం.. చరిత్ర సృష్టించనున్న హైదరాబాదీ స్టార్టప్

హైదరాబాద్, జులై 2: భారతీ అంతరిక్ష రంగంలో.. హైదరాబాద్ కంపెనీ కొత్త పుంతలు తొక్కనున్నది. నగరానికి చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ రూపొందించిన విక్రమ్-1 రాకెట్ త్వరలో నింగికి ఎగరనున్నది.

తొలిసారి దేశంలో ఓ ప్రైవేటు కంపెనీ.. ఆర్బిటాల్ క్లాస్ రాకెట్‌ను డెవలప్ చేసింది. విక్రమ్-1 రాకెట్ టెస్ట్ ఫ్లయిట్‌కు మిషన్ ఆగమన్ అని పేరు పెట్టారు. ప్రస్తుతం శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ సెంటర్‌లో ఉన్న ఫస్ట్ లాంచ్ ప్యాడ్‌లో ఆ రాకెట్ సిద్ధంగా ఉన్నది.

జూలై 12 నుంచి ఆగస్టు 4వ తేదీ మధ్య ఈ రాకెట్‌ను ప్రయోగించే అవకాశాలు ఉన్నాయి. గతంలో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థలో పనిచేసిన ఇంజినీర్లు ఈ స్కైరూట్ కంపెనీని స్థాపించారు. రాకెట్ ల్యాబ్ కంపెనీ తరహాలో స్కైరూట్ చిన్న తరహా రాకెట్లను నిర్మిస్తున్నది.

ఏడంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను మల్టీస్టేజ్ లాంచ్ వెహికిల్‌గా రూపొందించారు. దిగువ భూ-కక్ష్యలోకి సుమారు 350 కిలోగ్రాముల పేలోడ్‌ను ఈ రాకెట్ మోసుకెళ్తుంది. భారత్‌కు చెందిన బిలియన్ డాలర్ల స్పేస్ స్టార్టప్‌గా స్కైరూట్ నమోదు అయ్యింది.

# 'ఆమె నా చెల్లెలు'.. జపాన్ ప్రధానిని మెచ్చుకున్న ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, జులై 2: భారత పర్యటన కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి ని ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. గురువారం ఇరువురు నేతలూ సంయుక్త మీడియా సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను తన అందమైన చెల్లెలుగా మోదీ అభివర్ణించారు.

భారతదేశ వృద్ధి ప్రయాణంలో జపాన్ పాత్ర కీలకమని కొనియాడారు. ఆత్మీయంగా మోదీ పిలిచిన పిలుపుపై తకాయిచి సంతోషం వ్యక్తంచేశారు. రెండు దేశాలు అభివృద్ధి వైపు జరుపుతున్న ప్రయాణంతో తామిద్దరం ఒకే మార్గంలో ఉన్నామని పేర్కొన్నారు. ఈ విషయం తమ సంభాషణల్లో స్పష్టమైందని చెప్పారు.

# స్పీడ్ పోస్ట్‌తో దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా: సీపీ సజ్జనార్



హైదరాబాద్, జులై 2: దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ఊ- ఈజీబబి అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు.వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఖష్ట్రనీనివఖవ జఖఎ ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



కరీంనగర్, జులై 2:భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. ఎన్టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన బీఎల్‌వోలు , బీఎల్ఏలు , కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు .

ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని అన్నారు.ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని కోరారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి పూర్తి సహకారం తీసుకోవాలని, ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఇన్‌చార్జి కమిషనర్ అరుణ శ్రీ, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్-యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల కట్టడితో పర్యావరణ పరిరక్షణ

## (03 జూలై "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం" సందర్భంగా)

నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకెట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970-1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్స్‌గా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు.

### అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం-2026 :

ఒక నాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట 03 జూలై రోజున "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం" పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. 2026 దినోత్సవ ఇతివృత్తంగా "సింగిల్-యూజ్ ప్లాస్టిక్స్ విముక్తి : సుస్థిరమైన భవిష్యత్తు వైపు" అనబడే అంశాన్ని తీసుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ భూతాన్ని తరమడానికి ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలని పిలుపునిస్తున్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకనబద్దులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు.

### ప్లాస్టిక్ బ్యాగులు లేని పౌర సమాజ నిర్మాణం సాధ్యమా!

మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం, ప్లాస్టిక్ కవర్స్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలు మార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారు చేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి. సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తున్నాయి.

అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.



-మధుపాలీ
9949700037

# సముద్రంలో చిక్కిన ఆరుగురు మత్స్యకారులను రక్షించిన ఐసీజీ

న్యూఢిల్లీ, జులై 2:మంగళూరు తీరంలో మునిగిపోతున్న భారత మత్స్యకార పడవ (ఐఎఫ్‌బీ) మంజుమాతలోని ఆరుగురు మత్స్యకారులను భారత తీర రక్షక దళం కాపాడింది. కఠినమైన పరిస్థితుల్లో గాలింపు, రక్షణ (ఎస్ఏఆర్) చర్యలు చేపట్టింది. సూరత్కల్ తీర ప్రాంతానికి 33 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పడవ నుంచి సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో అత్యవసర సాయాన్ని కోరుతూ ఐసీజీ నౌక సచేత్‌కు వీహెచ్ఎఫ్ ఆర్టీ కాల్ వచ్చింది. సముద్రం అల్లకల్లోలంగా ఉండటం వల్ల పడవ లోపలికి నీరు చేరుతోందనీ, దీనివల్ల పడవలోని ఆరుగురి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని సమాచారం అందింది. తక్షణమే స్పందించిన ఐసీజీ, సహాయం అందించడం కోసం నౌకను మళ్లించి, ప్రమాదంలో ఉన్నవారిని చేరుకుంది.

అల్లకల్లోలమైన సముద్రం, బలమైన గాలులు, వెలుతురు తక్కువగా ఉండటం లాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఐసీజీఎస్ సచేత్ సిబ్బంది ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. మత్స్యకారులను చేరుకోవడానికి ప్రతికూల సముద్ర పరిస్థితులలో ఉపయోగించడానికి ప్రత్యేకంగా రూపొందించిన రిమోట్- ఆపరేటెడ్ లైఫ్‌బాయ్‌లను ఉపయోగించి వారిని రక్షించారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి పడవలో చిక్కుకున్న ఆరుగురినీ కాపాడారు. వారితోసహా ఐఎన్ఎస్ సచేత్ న్యూమంగుళూరు దిశగా తిరుగు ప్రయాణంలో ఉంది.

సముద్రంలో ప్రమాదాలకు గురైన వారిని కాపాడటంలో భారత తీరరక్షక దళానికి ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఈ ఆపరేషన్ నిదర్శనంగా నిలుస్తుంది. సముద్రాల్లో ఏర్పడిన సంక్లిష్టమైన అత్యవసర పరిస్థితులను అధిగమించేలా తీర రక్షక దళ సిబ్బంది ధైర్యం, శిక్షణ, వృత్తి నైపుణ్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన అనుసంధానాన్ని ఇది తెలియజేస్తుంది.

# భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ

న్యూఢిల్లీ, జులై 2:నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలను అందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం భారత సైన్యాధిపతి (సీఓఏఎస్) బాధ్యతల నుంచి ఇవాళ పదవీ విరమణ పొందారు. అత్యున్నత స్థాయి కార్యాచరణ సన్నద్ధతను కొనసాగించటం, త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయటం, సైన్యంలో పరివర్తనాత్మక ప్రక్రియను వేగవంతం చేయటం, సాంకేతికతను అందిపుచ్చుకోవటం, సాయుధ దళాల పునర్వ్యవస్థీకరణ, సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వటం వంటివి ఆయన పదవీకాలంలో గుర్తిండిపోయే అంశాలు.

భారత సైన్యాధిపతిగా జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్ని రక్షణ రంగాల్లో సైనిక సంసిద్ధతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఆయన నాయకత్వంలో ఆపరేషన్ స్నో లెపర్డ్ ద్వారా ఉత్తర సరిహద్దుల్లో పటిష్టమైన, అప్రమత్తమైన వ్యూహాన్ని భారత సైన్యం కొనసాగించింది. పశ్చిమ సరిహద్దులో పట్టుదల, సంయమనం, వృత్తిపరమైన నిబద్ధతతో బాధ్యతలను నిర్వర్తించింది. మారుతున్న భద్రతా వ్యవస్థలో భారత సైన్యం సంసిద్ధతను, ఖచ్చితత్వాన్ని వ్యూహాత్మక స్పందనను ప్రతిబింబిస్తూ ఆపరేషన్ సిందూర్.. ఆయన పదవీకాలంలో కీలక ప్రస్థానంగా నిలిచింది.

భారత సైన్యంలో ప్రస్తుతం సాగుతున్న దశాబ్దపు మార్పుల దిశగా జనరల్ ఉపేంద్ర ద్వివేది బలమైన దిశా నిర్దేశం చేశారు. ఆయన నాయకత్వంలో సైనిక బలగాల పునర్వ్యవస్థీకరణ, ఆధునీకరణ, సాంకేతిక వినియోగం, సమన్వయం, వ్యవస్థాగత సంస్కరణలు, మానవ వనరుల నిర్వహణ వంటి రంగాల్లో భారత సైన్యం సంస్కరణలను చేపట్టింది. ఆధునిక, క్రీయాశీలక, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా భారత సైన్యాన్ని తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా.. రుద్ర బ్రిగేడ్స్, భైరవ్ బెటాలియన్స్, అశ్ని డ్రోన్ ప్లాటూన్స్, శక్తిబాణ్ రెజిమెంట్స్, దివ్యాస్త్ర బ్యాటరీస్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ బ్రిగేడ్స్, ఇంటిగ్రేటెడ్ బాటిల్ గ్రూప్స్ (ఐబీజీలు) వంటి కీలక వినూత్న చర్యలను చేపట్టాం.

త్రివిధ దళాలు పరస్పరానుబంధంగా పనిచేయాలని జనరల్ ఉపేంద్ర ద్వివేది భావించారు. భవిష్యత్తులో జరిగే సంయుక్త, యుద్ధ రంగ ఆధారిత కార్యకలాపాల అవసరాలకు అనుగుణంగా ఆర్మీ, నేవీ, వైమానిక దళాల మధ్య సమగ్రత, ఉమ్మడి కార్యాచరణ ఆలోచన, మెరుగైన సమన్వయాన్ని ఆయన ప్రోత్సహించారు.

సైనిక సిబ్బంది, మాజీ సైనిక ఉద్యోగులు, వీర నారీల సంక్షేమానికి ఆయన పదవీకాలంలో అత్యంత ప్రాధాన్యత లభించింది. వెటరన్స్ అచీవర్స్ అవార్డు వంటి కార్యక్రమాల ద్వారా వారి సహకారానికి గుర్తింపును అందించటంతో పాటు సైనికులు, మాజీ సైనిక ఉద్యోగులతో సైన్యానికున్న బంధాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. సైనికులు, వారి కుటుంబాల పట్ల సైన్యానికున్న బాధ్యత కేవలం విధుల్లో ఉన్నంత వరకే పరిమితం కాదని.. ఆ తర్వాత కూడా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

భారత సైన్యం భవిష్యత్ సన్నద్ధతకు సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళికను అందించేందుకు వికసిత్ భారత్ విజన్-2047, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ విజన్-2047ల స్ఫూర్తితో రూపొందించిన వ్యూహాత్మక భద్రతా మార్గదర్శకాలు-2047 తయారీకి జనరల్ ఉపేంద్ర ద్వివేది దిశా నిర్దేశం చేశారు.

భారత సైన్యానికి జనరల్ ఉపేంద్ర ద్వివేది అందించిన విశేష సేవలకు గానూ ప్రతిష్ఠాత్మక పరమ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ పురస్కారాలను అందుకున్నారు.

# దేశవ్యాప్తంగా జరిగిన 22 పర్యటనల్లో పాల్గొన్న 1,100 మందికి పైగా యువ ప్రతినిధులు

న్యూఢిల్లీ, జులై 2:కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం నిర్వహించిన 'యువ సంఘం' ఆరో విడత కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జూన్ 19, 2026న మధ్యప్రదేశ్ నుంచి జార్ఖండ్‌కు సాగిన చివరి పర్యటనతో ఈ విడత పూర్తయింది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ (ఈబీఎస్‌బీ) పథకం కింద ప్రారంభించిన ఈ ప్రధాన కార్యక్రమం.. దేశంలోని యువతలో జాతీయ సమగ్రతను పెంపొందించడం, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడం, అనుభవపూర్వక అభ్యాసాన్ని అందించడం ప్రధాన లక్ష్యంగా సాగింది.

ఈ కార్యక్రమం దేశంలోని విభిన్న సంస్కృతులు, భాషలు, విద్యా, సామాజిక వైవిధ్యాన్ని యువత స్వయంగా అనుభవించడానికి ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఈ ఆరో విడతలో మొదటి పర్యటన మే 8, 2026న రాజస్థాన్ నుంచి కర్ణాటకకు ప్రారంభమైంది. పరస్పరం అనుసంధానించిన 22 రాష్ట్రాల నుంచి 1,26,000 మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకోగా, వారి నుంచి సుమారు 1,100 మంది ప్రతినిధులను తుది పర్యటనల కోసం ఎంపిక చేశారు. వివిధ రాష్ట్రాలను సందర్శించిన యువ బృందాలు ఆయా రాష్ట్రాల గవర్నర్లను, అలాగే కేంద్రపాలిత ప్రాంతాలను సందర్శించిన బృందాలు లెఫ్టినెంట్ గవర్నర్లను కలిసి.. పరిపాలన, రాజ్యాంగ విలువల ప్రాధాన్యత, న్యాయకత్వం, సమ్మిళిత అభివృద్ధి వంటి అంశాలపై విలువైన అవగాహనను పెంపొందించుకున్నాయి. ఈ పర్యటనల్లో భాగంగా ఒక ప్రత్యేక సందర్భంలో దేశ రాజధాని ఢిల్లీని సందర్శించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర యువ బృందం ప్రత్యేకంగా ఢిల్లీ ముఖ్యమంత్రితో సమావేశమై చర్చలు జరిపింది.

దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యాసంస్థలు ఈ యువ ప్రతినిధుల బృందాలకు ఆతిథ్యం ఇచ్చాయి. ఈ పర్యటనల్లో భాగంగా విద్యాసంబంధిత చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వారసత్వ ప్రదేశాల సందర్శనలు, నూతన ఆవిష్కరణల ప్రదర్శనలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొన్నారు. పరస్పరం అనుసంధానించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంప్రదాయాలు, అభివృద్ధి నమూనాలు, అక్కడి ఉత్తమ పద్ధతుల గురించి ఈ పర్యటనల ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అవగాహనను పెంపొందించుకున్నారు.

ఈ కార్యక్రమం అంతటా యువతీ యువకులు ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, కళాకారులు , స్థానిక ప్రజలతో కూడా సంభాషించారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, చారిత్రక ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలు, పారిశ్రామిక సంస్థలు, మ్యూజియాలు, సాంస్కృతిక ప్రదేశాల సందర్శన, దేశ వైవిధ్యం, ఉమ్మడి వారసత్వంపై వారి అవగాహనను సుసంపన్నం చేసింది. ప్రతినిధులు సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రదర్శనశాలలు, ముఖాముఖి చర్చల ద్వారా తమ సొంత ప్రాంతీయ సంప్రదాయాలను ప్రదర్శించారు. తద్వారా పరస్పర ప్రశంసలను మరియు జీవితకాల స్నేహాలను పెంపొందించుకున్నారు.

ఈ యువ సంఘం ఆరో విడతలో భాగంగా లభించిన ఈ అనుభవపూర్వక అభ్యాసంలో విద్యార్థులు ప్రముఖ విద్యాసంస్థలతో పాటు.. అంకుర సంస్థల ఆవిష్కరణలు, వ్యాపార వ్యవస్థలను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మక టీ-హబ్ వంటి ప్రముఖ ఇన్‌క్యుబేటర్ కేంద్రాలను, పరిశోధనా సంస్థలను, ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టులను, ప్రధాన మౌలిక వసతుల కేంద్రాలను సందర్శించారు. వీటితో పాటు యునెస్కో గుర్తించిన ప్రపంచ వారసత్వ ప్రదేశాలను, జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇతర చారిత్రక ప్రాంతాలను సందర్శించడం ద్వారా దేశ సాంస్కృతిక, నాగరికతా వారసత్వంపై యువతకు మరింత లోతైన అవగాహన లభించింది.

ఈ పర్యటనల కార్యక్రమం కేవలం సందర్శనలకే పరిమితం కాకుండా కలంకారీ పెయింటింగ్, వార్లీ పెయింటింగ్, గిరిజన కళారూపాలు, కుండల తయారీ, వివిధ హస్తకళల ప్రదర్శనలను యువత స్వయంగా నేర్చుకునేలా సాగింది. ఇందులో భాగంగా విద్యార్థులు స్థానిక కళాకారులు, వ్యవస్థాపకులు, స్థానిక సమాజాలతో ముఖాముఖి చర్చలు జరిపారు. వీటితో పాటు ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ అభియాన్ కింద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు, గ్రామ సందర్శనలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇవి పాల్గొన్న ప్రతినిధుల్లో సామాజిక బాధ్యతను, పర్యావరణ పరిరక్షణ పట్ల స్పృహను మరింత బలోపేతం చేశాయి.

దాదాపు ఆరు వారాల పాటు సాగిన యువ సంఘం ఆరో విడత యువ ప్రతినిధులు దేశంలోని విభిన్న భౌగోళిక ప్రాంతాలు, భాషలు, ఆహార సంస్కృతులు, సంప్రదాయాలు, దేశం సాధించిన అభివృద్ధి విజయాలను ప్రత్యక్షంగా అనుభవించేలా చేసింది.

భౌగోళిక సరిహద్దులను దాటి సరికొత్త స్నేహ బంధాలను నిర్మించుకోవడానికి ఇది ఒక వేదికగా నిలిచింది. ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందిస్తూ, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని బలోపేతం చేసిన ఈ కార్యక్రమం.. "ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్" దార్శనికతను ప్రతిబింబించింది.

# ఎస్ఐఆర్‌పై అపోహలు వద్దు: తహసీల్దార్




ఆదిలాబాద్, జులై 2: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తహసీల్దార్ పవన్ చంద్ర సూచించారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను అందజేయడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఫారాలు బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉన్నాయని, ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్వేలో భాగస్వామి కావాలని కోరారు.

రాజకీయ పార్టీలు కూడా ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ ప్రకాష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అభిమన్యు, ఉప సర్పంచ్ సయ్యద్ అలీ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






# విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను ఛేదించిన డీఆర్ఐ.. .15 కిలోల బంగారం స్వాధీనం, నలుగురు అరెస్ట్

న్యూ ఢిల్లీ, జులై 2:ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న భారీ బంగారం స్మగ్లింగ్ ముఠా గుట్టును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రట్టు చేశారు. ఒక పెద్ద ఆపరేషన్ చేపట్టిన అధికారులు.. అంతర్జాతీయ సరిహద్దుల గుండా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ఛేదించారు. వారి నుంచి రూ. 21.40 కోట్ల విలువైన 15 కిలోల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీలోని కొరియర్ టెర్మినల్ వద్ద థాయ్‌లాండ్ నుంచి వచ్చిన ఒక అంతర్జాతీయ కన్సైన్‌మెంట్‌ను డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ఒక విదేశీయుడితో సంబంధం ఉన్న సంస్థ పేరు మీద ఈ కన్సైన్‌మెంట్ వచ్చింది. ఇందులో 'వాడేసిన గేర్ భాగాలు' ఉన్నట్లు అధికారికంగా నమోదు చేసుకున్నారు. అయితే వాటిని నిశితంగా పరిశీలించగా గేర్ విడిభాగాల లోపల అత్యంత చాకచక్యంగా దాచి పెట్టిన 8 డిస్క్ ఆకారపు విదేశీ బంగారు ముక్కలను అధికారులు గుర్తించారు. ఇవి ఒక్కొక్కటి 1.5 కిలోల బరువున్నాయి. ఆ కన్సైన్‌మెంట్ నుంచి స్మగ్లింగ్ చేస్తున్న మొత్తం 12 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బంగారాన్ని అందుకోవలసిన వ్యక్తితో పాటు, ఈ స్మగ్లింగ్ సూత్రధారి నివాసాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో ఒక్కొక్కటి 1.5 కిలోల బరువున్న మరో రెండు ఇదే తరహా డిస్క్ ఆకారపు విదేశీ బంగారు ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

# బాసర ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపు



ఆదిలాబాద్, జులై 2: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపును గురువారం ఆలయ ఈవో అంజనీ దేవి సమక్షంలో ప్రారంభించారు. ఆలయంలోని రూ.150 అక్షరాభ్యాస మండపంలో భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ ప్రక్రియ చేపట్టారు.

హుండీలోని నగదు, ఇతర కానుకల పూర్తి లెక్కింపు అనంతరం వివరాలను సాయంత్రానికి వెల్లడిస్తామని ఆలయ ఈవో అంజనీ దేవి తెలిపారు.

# లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ సంస్థ పదో స్నాతకోత్సవంలో ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా

న్యూఢిల్లీ, జులై 2:న్యూఢిల్లీలో జరిగిన లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్) పదో స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ప్రసంగించారు.

విద్యార్థుల విద్యా, వృత్తి ప్రయాణంలో చిరస్మరణీయంగా నిలిచిపోయే సందర్భంగా ఈ స్నాతకోత్సవాన్ని శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా వర్ణించారు. పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రోగుల సంరక్షణ, వైద్య విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో ఉత్తమ పనితీరుకు గుర్తింపు పొందిన లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్) లాంటి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన, ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థ నుంచి పట్టభద్రులు కావడం వారికి దక్కిన అదృష్టమన్నారు.

ప్రజారోగ్యంలో ఐఎల్‌బీఎస్ సంస్థ చేసిన సేవలను శ్రీ నడ్డా వివరించారు. దేశవ్యాప్తంగా ఫ్యాటీ లివర్ గురించి అవగాహన కల్పించడంలో ఈ సంస్థ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. వైద్య సేవలు, పరిశోధన, ప్రచారం ద్వారా ఫ్యాటీ లివర్, దానికి గల కారణాలు, నివారణ, దీర్ఘకాలంగా ఆరోగ్యంపై చూపించే ప్రభావాలపై అవగాహనను విస్తరించేందుకు ఈ సంస్థ గణనీయమైన కృషి చేసింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలోని ప్రభుత్వం వైద్య విద్యను బలోపేతం చేయడానికి సమగ్ర విధానాన్ని స్వీకరించిందని కేంద్ర ఆరోగ్య మంత్రి చెప్పారు. దీనికోసం వైద్య విద్యకు సంబంధించిన 'హార్డ్‌వేర్', 'సాఫ్ట్‌వేర్' రెండింటిపైనా దృష్టి సారిస్తోందని తెలియజేశారు. 'హార్డ్‌వేర్' అంటే అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, వైద్య సంస్థలు, ఆరోగ్య సేవల సౌకర్యాలని తెలిపారు. అలాగే విద్యార్థులు, పరిశోధకులు, ఆరోగ్య నిపుణులు రాణించేలా వ్యవస్థను, విధానాలను, విద్యా రంగాన్ని 'సాఫ్ట్‌వేర్' సూచిస్తుందని చెప్పారు. దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలం.. కేవలం సంస్థలను ఏర్పాటు చేయడంలోనే కాకుండా సామర్థ్యం వికసించేలా వ్యవస్థను నిర్మించడంలో కూడా ఉందని ఆయన తెలియజేశారు.

విధానపరమైన సంస్కరణలు తీసుకొచ్చే పరివర్తనాత్మక ప్రభావాల గురించి శ్రీ నడ్డా వివరించారు. దూరదృష్టితో కూడిన విధానాల రూపకల్పన, వాటికి తోడ్పాటును అందించే వ్యవస్థ కలసి శాశ్వతమైన మార్పును ఎలా సృష్టిస్తాయో విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. 20వ శతాబ్దం చివరి నాటికి భారత దేశంలో ఒకే ఒక్క ఎయిమ్స్ ఉండేదని చెప్పారు. మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజపేయి హయాంలో మరో ఆరు ఎయిమ్స్ సంస్థలకు ఆమోదం లభించింది. ఆ తర్వాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో పదహారు కొత్త ఎయిమ్స్ సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించాయి. ప్రస్తుతం దేశంలో మొత్తం ఇరవై మూడు ఎయిమ్స్ సంస్థలున్నాయి.

దేశవ్యాప్తంగా వైద్య విద్య మౌలిక వసతుల విస్తరణలో సాధిస్తున్న అపూర్వమైన పురోగతిని కేంద్ర మంత్రి వివరించారు. వైద్య కళాశాలల సంఖ్య 387 నుంచి 818కు పెరిగిందని ఆయన వెల్లడించారు. అదే విధంగా, అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు సుమారుగా 50,000 నుంచి 1.20 లక్షలకు పైగా పెరిగాయని చెప్పారు. ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి చేసిన ప్రకటనను ఉటంకిస్తూ.. వచ్చే అయిదేళ్లలో అదనంగా మరో 75,000 అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలియజేశారు. ఇప్పటికే 25,000 సీట్లను జోడించామని, ఇది లక్ష్యసాధనలో స్థిరంగా సాధిస్తున్న పురోగతిని ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. అలాగే, పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు సైతం సుమారుగా 30,000 నుంచి 80,000కు పైగా పెరిగాయని చెప్పారు. దీనివల్ల దేశంలో స్పెషలిస్టు డాక్టర్లు పెద్ద సంఖ్యలో అందుబాటులోకి వస్తారని తెలియజేశారు.

దాదాపు 1.5 బిలియన్ల మంది ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి ఆరోగ్య సేవల పంపిణీ వ్యవస్థకు పునాదిని బలోపేతం చేయడం అవసరమని శ్రీ నడ్డా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్తంగా 1.85 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేయడం గురించి ఆయన వివరించారు. వాటిని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే మొదటి సంప్రదింపుల కేంద్రాలుగా వర్ణించారు. నివారణ, ఆరోగ్యాన్ని పెంపొందించే, చికిత్స, పునరావాస సేవలకు సమప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవల దిశగా దేశ విధానాన్ని ఈ కేంద్రాలు మారుస్తున్నాయని ఆయన వివరించారు.

నివారణ ఆరోగ్య సేవల ప్రాధాన్యం గురించి కేంద్ర మంత్రి వివరిస్తూ.. అసాంక్రమిక వ్యాధులను గుర్తించడంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు సాధించిన విజయాలను ప్రస్తావించారు. సుమారు 42 కోట్ల మందికి పైగా రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తే.. వారిలో 7.3 కోట్ల మందిలో నిర్ధారణ అయిందని చెప్పారు. అలాగే, 42 కోట్లకు పైగా ప్రజలకు మధుమేహ పరీక్షలు నిర్వహిస్తే వారిలో దాదాపు 5 కోట్ల మందిలో వ్యాధి నిర్ధారణ అయింది. 35 కోట్లకు పైగా ప్రజలకు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తే.. వారిలో 2.3 లక్షలకు పైగా కేసులను గుర్తించారు. 16 కోట్లకు పైగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తే.. 86,000 కంటే ఎక్కువ మందిలో వ్యాధి నిర్ధారణ అయింది. 9 కోట్ల మందికి పైగా సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తే.. సుమారుగా ఒక లక్ష మందిలో ఈ క్యాన్సర్‌ను గుర్తించారు. సకాలంలో పరీక్షలు నిర్వహించడం, ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా నివారణ ఆరోగ్య సేవలు ఎలా బలోపేతమవుతాయో, మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ఎలా వీలు కలుగుతుందో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయని శ్రీ నడ్డా చెప్పారు.

స్వాస్థ్య భారత్ లేకుండా వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం కాదని కేంద్ర మంత్రి అన్నారు. భవిష్యత్తులో భారతదేశంలో ఆరోగ్య సేవల వ్యూహంలో నివారణ ఆరోగ్య సేవలు, ముందుగానే పరీక్షలు నిర్వహించడం, సకాలంలో వ్యాధిని నిర్ధారించడం ప్రధానాంశాలుగా మారతాయని ఆయన స్పష్టం చేశారు.

సూపర్ స్పెషాలిటీ విద్యను అభ్యసించడం అదృష్టం, బాధ్యత రెండూ అని పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి శ్రీ నడ్డా అన్నారు. అంకితభావంతో కూడిన సేవలు, అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య నైతిక విలువలు, వృత్తి జీవితంలో దయతో వ్యవహరించడం, నిజాయతీతో, అత్యుత్తమ నైపుణ్యాలతో మానవాళికి సేవ చేయాలనే నిబద్ధతతో ఉండటం ద్వారా సమాజానికి సేవ చేయాలని సూచించారు. తమ విజ్ఞానం, నైపుణ్యాలు, చిత్తశుద్ధితో ఆరోగ్యకరమైన, బలమైన భారత దేశాన్ని నిర్మించే బాధ్యతను తీసుకోవాలని వారిని ప్రోత్సహించారు.

ఈ స్నాతకోత్సవంలో కాలేయ వ్యాధులు, హెపటాలజీ, అవయవ మార్పిడి చికిత్స, సంబంధిత రంగాల్లో వివిధ సూపర్-స్పెషాలిటీ, అనుబంధ విభాగాల్లో డిగ్రీలు, అకడమిక్ డిస్టింక్షన్‌లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం పట్టభద్రులైన విద్యార్థులకు ముఖ్యమైన మజిలీగా నిలిచిపోతుంది.

జాతీయ రాజధాని ఢిల్లీ ప్రభుత్వ పరిధిలో స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ సూపర్-స్పెషాలిటీ సంస్థ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్). ఇది హెపటాలజీ, కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స, పిత్తాశయ శాస్త్రాలు, అనుబంధ విభాగాల్లో రోగుల సంరక్షణ, వైద్య విద్య, పరిశోధనలో అత్యుత్తమ సంస్థగా పేరు తెచ్చుకుంది.

×వైద్య సేవలు, నాణ్యమైన విద్య, అత్యాధునిక పరిశోధనల్లో సమగ్ర విధానాన్ని అనుసరించడం ద్వారా దేశంలో పెరుగుతున్న కాలేయ వ్యాధుల భారాన్ని పరిష్కరించడంలో ఈ సంస్థ గణనీయమైన కృషి చేసింది.

# జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఎదుట అప్పీళ్ల దాఖలుకు చివరి తేదీని జూలై 31, వరకు పొడగించిన ప్రభుత్వం

న్యూ ఢిల్లీ, జులై 2:సెక్షన్ 112(1), సెక్షన్ 112(3) ప్రకారం వస్తు, సేవల పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) ఎదుట అప్పీళ్ల దాఖలుకు నిర్దేశించిన గడువును జూలై 31, 2026 వరకు ప్రభుత్వం పొడిగించింది.

ప్రభుత్వం 17.09.2025న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. జీఎస్‌టీఏటీ ఎదుట అప్పీళ్లను దాఖలు చేసేందుకు 30.06.2025 చివరి తేదీగా ప్రకటించింది.

జీఎస్‌టీఏటీ పోర్టల్‌లో అప్పీళ్లు దాఖలు చేసేందుకు ఆఖరి నిమిషంలో ఏర్పడుతున్న రద్దీ కారణంగా సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న పన్ను చెల్లింపుదారుల విజ్ఞప్తి కారణంగా, ప్రభుత్వం అప్పీలు దాఖలుకు చివరి తేదీని పొడిగించింది. ఈ గడువును ముందస్తుగా 2025 సెప్టెంబర్‌లోనే ప్రకటించినప్పటికీ.. గత 15 రోజుల్లో ఏకంగా 30,000 అప్పీళ్లు దాఖలయ్యాయి. రోజువారీగా గరిష్ఠంగా 5,500 అప్పీళ్లు దాఖలయ్యాయి.

అప్పీలు దాఖలుకు పన్ను చెల్లింపుదారులు ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, గడువు తేదీ వరకు వేచి ఉండవద్దని ప్రభుత్వం సూచించింది.

# నిరుపయోగ చెరువులకు పునర్జీవం: కలెక్టర్



కరీంనగర్, జులై 2: నిరుపయోగంగా ఉన్న చేపల చెరువులను పునరుద్ధరించి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం రామగుండం మండలంలోని మేడిపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న చేపల చెరువులను ఆయన పరిశీలించారు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఏడు చేపల చెరువులు ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో వాటిని మరమ్మతులు చేసి తిరిగి చేపల పెంపకానికి అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు.

చేపల చెరువుల పునరుద్ధరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అమలు చేయాలని, స్థానిక యువతకు చేపల పెంపకంలో శిక్షణ, సాంకేతిక సహకారం అందించి ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సింగరేణి యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు, సింగరేణి ఆర్జీ-1 జీఎం మేనేజర్ లలిత్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమ ఆసియాలో ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో, కీలకమైన పెట్రోకెమికల్ ఉత్పత్తులపై పూర్తి కస్టమ్స్ సుంకం మినహాయింపును జూలై 15 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జులై 2:పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, తద్వారా ప్రపంచ సరఫరా వ్యవస్థలో తలెత్తిన అంతరాయాల నేపథ్యంలో.తాత్కాలిక, తక్షణ ఉపశమన చర్యగా, కీలకమైన పెట్రోకెమికల్ ఉత్పత్తుల దిగుమతులపై పూర్తి కస్టమ్స్ సుంకం మినహాయింపును ప్రభుత్వం గతంలో 2026 జూన్ 30 వరకు అమలు చేసింది.

ఈ కాలంలో దేశీయ పెట్రోలియం కంపెనీలను ఎల్‌పీజీ ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరినందున దేశీయ మార్కెట్లో పెట్రోకెమికల్స్ కొరత లేకుండా తగినంత అందుబాటులో ఉంచేలా ఈ సుంకం మినహాయింపును ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి వస్తుండటంతో, సంబంధిత రంగాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాధారణ మార్పు వచ్చేలా చూడటం కోసం, సదరు మినహాయింపును మరో 15 రోజుల పాటు, అంటే 2026 జూలై 15 వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఈ మినహాయింపు వర్తించే ఉత్పత్తుల జాబితా గతంలో నోటిఫై చేసిన విధంగానే యథాతథంగా కొనసాగుతుంది.

భారత తయారీ రంగానికి మద్దతు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తన కట్టుబాటును కొనసాగిస్తోంది. గతంలో మాదిరిగానే, ఈ సుంక మినహాయింపు పెట్రోకెమికల్ ఫీడ్‌స్టాక్‌లు, మధ్యంతర ఉత్పత్తులపై ఆధారపడిన ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్, వస్త్రాలు, ఔషధాలు, రసాయనాలు, ఆటోమోటివ్ విడిభాగాలు తదితర తయారీ రంగాలకు విస్తృతంగా ప్రయోజనం చేకూర్చనుంది. అంతేకాకుండా, తుది ఉత్పత్తులను వినియోగించే వినియోగదారులకు కూడా ఈ చర్య ఉపశమనం కలిగించనుంది.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎంవీఐ వంశీధర్



కరీంనగర్, జులై 2: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలు ప్రభుత్వ నిబంధనల మేరకే నడపాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్ హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న రెండు వాహనాలపై కేసులు నమోదు చేసి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా స్కూల్ బస్సులపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. ప్రతి బస్సులో ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్, తాగునీటి సదుపాయం, ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్‌తో పాటు అటెండర్ కూడా ఉండాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వైపర్లు, రివర్స్ హారన్, లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీజ్ చేసిన వాహనాలను వేములవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఎన్‌హెచ్ఏఐతో సహకరించేందుకు సుముఖత వ్యక్తం చేసిన సుమారు 12 ఐఐటీలు, ఇతర ప్రముఖ సంస్థలు

న్యూఢిల్లీ, జులై 2:జాతీయ రహదారుల నెట్‌వర్క్ భద్రత, నాణ్యత, దీర్ఘకాలిక మన్నిక బలోపేతం లక్ష్యంగా అన్ని కొత్త ప్రాజెక్టుల్లోని ప్రధాన వంతెన నిర్మాణాల హైడ్రాలిక్ అధ్యయనాలు, డిజైన్ల పారదర్శక పరిశీలన కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు), ఇతర ప్రతిష్ఠాత్మక సాంకేతిక సంస్థలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) నియమించనుంది. 100 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం సేవలందించేలా రూపొందించిన ప్రధాన వంతెనల కోసం నిర్మాణానికి ముందు కఠినమైన స్వతంత్ర సాంకేతిక సమీక్ష నిర్వహించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బొంబాయి, ఐఐటీ రూర్కీ, ఐఐటీ ఖరగ్‌పూర్, అనేక ఇతర ప్రముఖ సంస్థలు సహా సుమారు 12 ఐఐటీలు ఎన్‌హెచ్ఏఐతో సహకరించడానికి సుముఖత వ్యక్తం చేశాయి.

కీలకమైన వంతెన ప్రాజెక్టుల డిజైన్ల పరిశీలన కోసం దేశవ్యాప్త సంస్థాగత విధాన ప్రణాళికను రూపొందించడానికి ఎన్‌హెచ్ఏఐకి ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. నాణ్యతకు భరోసా ఉండే పద్ధతులను బలోపేతం చేయడానికి, వంతెన ప్రాజెక్టుల మెరుగైన రూపకల్పన, అమలును ప్రోత్సహించడానికి ఈ విధాన ప్రణాళిక సహాయపడుతుంది. నిర్మాణ డిజైన్ల గణనలు, ఇంజనీరింగ్ డ్రాయింగ్‌లు, నిర్మాణ పద్ధతులు, భూ సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలిక్ అధ్యయనాల సమీక్షలు ఈ కార్యక్రమంలో భాగంగా ఉంటాయి.

# 'ఎఫ్‌సీఆర్ఏ 2.0' పోర్టల్.. 'ఇ-ఓసీఐ కార్డు'ను ప్రారంభించిన కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా




న్యూ ఢిల్లీ, జులై 2:కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు న్యూఢిల్లీలో 'ఎఫ్‌సీఆర్ఏ 2.0' పోర్టల్ సహా 'ఇ-ఓసీఐ' కార్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోం, విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శులతోపాటు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ- ఈ రెండు కొత్త కార్యక్రమాలు పౌరులకు సౌలభ్యం కల్పించడమే కాకుండా ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మెరుగైన సదుపాయాలు లభిస్తాయని, ముఖ్యంగా 'ఎఫ్‌సీఆర్ఏ' పోర్టల్ ద్వారా విరాళాలు పొందేవారికి కలిగే ఇబ్బందులను పరిష్కరిస్తాయని ఆయన చెప్పారు. శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 2014లో బాధ్యతలు చేపట్టిన తర్వాత 'కనిష్ఠ ప్రభుత్వం ? గరిష్ఠ పాలన' సూత్రంపై ప్రాతిపదికగా తమ కర్తవ్యం నిర్వర్తిస్తామని చెప్పడాన్ని గుర్తుచేశారు. సత్సంకల్పం, సుస్పష్ట విధానం, సాంకేతిక దృక్పథం కలగలిస్తే, నిజాయితీపరులకు పాలన అత్యంత సులువు కాగలదన్నారు. అదే సమయంలో తప్పు చేసేవారిపై కఠిన నిఘా వ్యవస్థ ద్వారా దేశం మరింత సురక్షితంగా ఉంటుందని శ్రీ అమిత్ షా అన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ వ్యవస్థ 2014కు ముందు ఫైళ్ల గందరగోళంలో చిక్కి, పర్యవేక్షణకు దూరంగా ఉండేదని, మోదీ ప్రభుత్వం హయాంలో సంక్లిష్ట విధానాల నుంచి విముక్తి పొంది నేడు మరింత బలోపేతమైందని హోంశాఖ మంత్రి అన్నారు. జాతీయ భద్రతతోపాటు దేశ పురోగమనానికి ఈ పర్యవేక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఈ నేపథ్యంలో 'ఎఫ్‌సీఆర్ఏ' పోర్టల్‌ను నేడు ఆధునికీకరించడంతో సంస్థల కార్యకలాపాలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా దరఖాస్తుల సంఖ్య, విరాళాల ప్రవాహం గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కాగితపు పని తగ్గింపు, విదేశీ విరాళాలపై ప్రత్యక్ష, సమర్థ పర్యవేక్షణకు భరోసా ఇవ్వడం దేశ భద్రతకు అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఈ చట్టం అమలుతో దురుద్దేశపూరిత విదేశీ విరాళాలపై నిఘా పెరుగుతుందని చెప్పారు. మరోవైపు ఈ కొత్త వ్యవస్థ వల్ల పత్రాల భౌతిక సమర్పణ ప్రక్రియతో అవసరం ఉండదన్నారు. 'ఇ-సైన్' ఆధారిత ధ్రువీకరణ, 'ఓసీఆర్', 'ఎన్‌జీవో దర్పణ్' బ్యాంకు ఖాతా అనుసంధాన వ్యవస్థ వంటి సదుపాయాలు లభిస్తాయి. ఈ సమాచారమంతా 'మేఘ్‌రాజ్' (ప్రభుత్వ క్లౌడ్)లో భద్రంగా ఉంటుంది కాబట్టి, డేటా చౌర్యానికి అవకాశం దాదాపు ఉండదన్నారు. దీంతోపాటు రాబోయే నెలల్లో 'ఎఫ్‌సీఆర్ఏ' మొబైల్ అప్లికేషన్, ఏఐ ఆధారిత చాట్‌బాట్, బ్యాంకుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డ్ కూడా ప్రారంభమవుతాయని తెలిపారు.

అలాగే, 'ఇ-ఓసీఐ' కార్డును నేడు ప్రారంభించడాన్ని గుర్తుచేస్తూ- ఓసీఐ వ్యవస్థకు శ్రీకారం చుట్టినపుడు ఎదురైన సమస్యలను ప్రస్తుత కొత్త విధానంలో పరిష్కరించామని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు. ఇది 50 లక్షల మందికి పైగా ఓసీఐ కార్డుదారులకు ఎంతో ఉపయుక్తం కాగలదని చెప్పారు.

ఓ 20 ఏళ్ల తర్వాత కొత్త పాస్‌పోర్ట్ జారీ అయితే, ఓసీఐ బుక్‌లెట్ తిరిగి జారీచేసే అవసరం ఉండదన్నారు. అంతేకాకుండా కార్డుదారుకు విశిష్ట రిజిస్ట్రేషన్ నంబర్ కూడా ఉంటుందని, ఈ డిజిటల్ ఓసీఐ కార్డు వల్ల పత్రాలు పోగొట్టుకోవడం లేదా పాడు కావడం వంటి సమస్యలకు తావుండదని చెప్పారు. తక్షణ ప్రత్యక్ష ధ్రువీకరణకు వీలుంటుంది కాబట్టి ఎలాంటి సమస్యలూ తలెత్తవని పేర్కొన్నారు.

'విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం' నిబంధనల సరళీకరణ సహా పర్యవేక్షణ, అమలు యంత్రాంగాల బలోపేతం లక్ష్యంగా 'ఎఫ్‌సీఆర్ఏ 2.0' పోర్టల్ రూపొందింది. తద్వారా దరఖాస్తు, పునరుద్ధరణ, వార్షిక రిటర్న్ దాఖలు తదితర సేవల సంబంధిత ప్రధాన ప్రక్రియలన్నీ ఇప్పుడు పూర్తి డిజిటల్ విధానంలోకి మారిపోయాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 14,500 క్రియాశీల 'ఎఫ్‌సీఆర్ఏ' సంస్థలు పనిచేస్తుండగా, ఏటా దాదాపు 15,000 నుంచి 20,000 దాకా దరఖాస్తులు వస్తున్నాయి. దీంతోపాటు 17,000 దాకా వార్షిక రిటర్నులు దాఖలవుతున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో సాగుతున్న కార్యకలాపాల పర్యవేక్షణ కోసం ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సురక్షిత వ్యవస్థ అవసరం ఎంతయినా ఉంది. ఆ మేరకు 'నేషనల్ గవర్నమెంట్ క్లౌడ్' (మేఘ్‌రాజ్) పరిధిలో ఇది పనిచేస్తుంది. తదనుగుణంగా ప్రక్రియల పునర్వ్యవస్థీకరణ, సమగ్ర డాష్‌బోర్డ్, ఆధార్ సంధానిత ధ్రువీకరణ, ఇ-సైన్ సదుపాయం, ఓసీఆర్ ఆధారిత పత్రాల విశ్లేషణ వంటి అంశాలెన్నో ఈ పోర్టల్‌లో ఉన్నాయి. కొత్త 'ఎఫ్‌సీఆర్ఏ సవరణ నిబంధనలు-2026'లోని కీలకాంశాలను కూడా ఈ పోర్టల్‌లో పొందుపరిచారు. అంతేకాకుండా పాన్, ఆధార్, ఓసీఐ, ఎన్‌జీవో దర్పణ్ సహా ఐసీఏఐ పరిధిలోని యూడీఐఎన్ వ్యవస్థ సహా ప్రభుత్వ ప్రధాన సమాచార నిధులు, బ్యాంకులతోనూ ఈ పోర్టల్‌ను అనుసంధానించారు.

సంస్థల విషయానికొస్తే, ఈ పోర్టల్ ద్వారా కాగితపు పని తగ్గి, సమయం ఆదాకావడమే కాకుండా సరళ, సౌలభ్య అనుభవం లభిస్తుంది. దరఖాస్తు పరిశీలన వేగం పెరగడంతోపాటు లాగిన్ ఆధారిత సమగ్ర డాష్‌బోర్డ్ సౌకర్యాం అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వంతో, ప్రధాన సమాచార నిధులతో ఏపీఐ ఆధారిత అనుసంధానం వల్ల ధ్రువీకరణ వేగం, కచ్చితత్వం ఇనుమడిస్తాయి. నిబంధనల ద్వారా పర్యవేక్షణ మెరుగుపడటం సహా విదేశీ విరాళాల స్వీకరణ-వినియోగంపై సమర్థ పర్యవేక్షణకు వీలుంటుంది. తద్వారా జాతీయ భద్రత, సుపరిపాలన రెండూ బలోపేతమవుతాయి. ఏఐ ఆధారిత చాట్‌బాట్, మొబైల్ ద్వారా అందుబాటు వంటి భవిష్యత్తు విశిష్టతల కల్పకు తగినట్లు ఈ వేదిక రూపొందింది.

ఎలక్ట్రానిక్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఇ-ఓసీఐ) కార్డు పూర్తి డిజిటల్ వ్యవస్థ ద్వారా ప్రపంచవ్యాప్త ప్రవాస భారతీయులకు వినూత్న రీతిలో ఓసీఐ సేవలందించే లక్ష్యంతో చేపట్టిన కీలక పౌర కేంద్రక కార్యక్రమం. దీనికింద దరఖాస్తు సమర్పణ, అనుబంధ పత్రాల అప్‌లోడ్ నుంచి ఆమోదానంతరం డిజిటల్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవడం వరకూ ఓసీఐ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ మాధ్యమం ద్వారానే ముగించవచ్చు. ప్రస్తుత కార్డుదారులు కూడా చాలా సందర్భాల్లో కొత్త దరఖాస్తు లేదా భౌతిక ధ్రువీకరణతో నిమిత్తం లేకుండా తమ 'ఇ-ఓసీఐ' కార్డును డిజిటల్‌గా పొందవచ్చు. ఈ కొత్త వ్యవస్థ ప్రకారం- 20 ఏళ్ల వయస్సు తర్వాత కొత్త పాస్‌పోర్ట్ పొందే సమయంలో 'ఓసీఐ' బుక్‌లెట్‌ను తిరిగి జారీ చేసే అవసరం ఇకపై ఉండదు. అయితే, కొత్త పాస్‌పోర్ట్ జారీ అయినప్పుడల్లా కార్డుదారులు తత్సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

అందువల్ల ఈ వ్యవస్థతో దరఖాస్తుదారులకు సరళ, సౌలభ్య, పూర్తి డిజిటల్ అనుభవం లభిస్తుంది. ప్రత్యక్ష హాజరీ అవసరం తొలగిపోవడమేగాక మొబైల్ ద్వారా ఎప్పుడైనా వినియోగానికి వీలు కల్పిస్తుంది. డిజిటల్ జారీ ద్వారా పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను వేగిరపరుస్తుంది. భౌతిక పత్రాలను పోగొట్టుకునే లేదా పాడుచేసుకునే ముప్పును తొలగిస్తూ, సత్వర ఇమ్మిగ్రేషన్ అనుమతులకు వీలు కల్పించడం ద్వారా ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. ఈ వ్యవస్థతో పూర్తిస్థాయి ఆన్‌లైన్ పరిశీలన ప్రక్రియ అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వానికి కూడా కాగితపు పని తగ్గి, పాలన వ్యయం ఆదా అవుతుంది. సమాచార నిర్వహణకు వీలు కల్పిస్తూ కేంద్రీకృత పర్యవేక్షణను బలపరుస్తుంది. మరోవైపు విమానాశ్రయాలలో ప్రత్యక్ష ధ్రువీకరణ కోసం డిజిటల్ ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలతో అనుసంధానితమవుతుంది. కాబట్టి, గుర్తింపు ధ్రువీకరణ మెరుగుపడటమే కాకుండా భద్రత పెరిగి, మోసాల ముప్పు తగ్గుతుంది.

'ఎఫ్‌సీఆర్ఏ 2.0' పోర్టల్, 'ఇ-ఓసీఐ' కార్డు ప్రారంభం రెండూ... ప్రజలకు నిరంతర సేవల ప్రదానం, మెరుగైన పరిపాలన దిశగా సాంకేతికత వినియోగంలో హోం మంత్రిత్వ శాఖ సాధించిన మరో కీలక విజయాన్ని ప్రతిబింబిస్తాయి. మరింత పారదర్శక, సురక్షిత, డిజిటల్‌గా సాధికార పాలన వ్యవస్థ రూపకల్పనలో ఇవి దోహదం చేస్తాయి.

## మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నేతలు.. గ్రామ సమస్యలపై వినతి



ఖమ్మం, జులై 2: దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలంలోని ముష్టిబండ గ్రామ సర్పంచ్ సిద్దిన రాధాకుమారి గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

వినతిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మన్యం అప్పారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, ముష్టిబండ సర్పంచ్ సిద్దిన రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలు, భూతగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

న్యూఢిల్లీ, జులై 2: ప్రజలు భూతగాదాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం రాత్రి నిర్వహిస్తున్న 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమంలో భాగంగా, గరిడేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోనుగోడు గ్రామంలో సామాజిక అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీఐ చరమందరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నేటి ఆధునిక సమాజం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ముందుకు దూసుకుపోతోందని, ఇలాంటి రోజుల్లో ఇంకా బాణామతి, చేతబడులు, మంత్రాలు, తంత్రాలు అంటూ నమ్మడం అవివేకమని కొట్టిపారేశారు. సమాజంలో అలాంటివి ఏమీ లేవని, కేవలం భ్రమలతో కొందరు గొడవలకు దిగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో యువత, పౌరులు సత్ప్రవర్తనతో మెలగాలని, నేర రహిత సమాజ స్థాపనకు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పొలాల వద్ద గట్ల తగాదాలు, స్థల వివాదాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే గ్రామంలో పెద్దల సమక్షంలో లేదా చట్టబద్ధంగా సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప, భౌతిక దాడులకు పాల్పడకూడదని హెచ్చరించారు. గతంలో పోనుగోడు గ్రామంలో జరిగిన ఒక భూ పంచాయితీ కారణంగానే నలుగురు వ్యక్తులకు కోర్టు జీవిత ఖైదు విధించిన చేదు నిజాన్ని ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు గుర్తు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటకం వేణు ఉపసర్పంచ్ అరవింద్ రెడ్డి మాజీ బీఆర్ఎస్ చైర్మన్ కలకం లక్ష్మీనారాయణ ఖడ్గం రమేష్ చామకూరి గురుస్వామి ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది మరియు పోనుగోడు గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీంగల్ ఊర పండుగకు రూ. లక్ష విరాళం..



నిజామాబాద్, జులై 2: భీంగల్ పట్టణంలో త్వరలో నిర్వహించనున్న సాంప్రదాయ ఊర పండుగ ఏర్పాట్ల కోసం రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ రూ.1 లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఊర పండుగను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక ప్రజలు, దాతలు, ప్రజాప్రతినిధులు అందరూ సహకరించాలని ఈరవత్రి అనిల్ కుమార్ కోరారు. భీంగల్ ప్రజల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఈరవత్రి అనిల్ కుమార్ అందించిన రూ. లక్ష విరాళం ఊర పండుగ ఏర్పాట్లకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బోదిరే స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, సర్వ సమాజ్ అధ్యక్షులు పతాని కృష్ణ, జేజే నర్సయ్య, రఘు, బ్రహ్మం, సురేష్, శెవ్వ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## వరద కాల్వ ద్వారా ఆయకట్టు గ్రామాల చెరువులు నింపాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, జులై 2: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని వరద కాల్వ మరమ్మతు పనులు పూర్తి అయినందున వరద కాలువను రివర్స్ పంపింగ్ ద్వారా నింపి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఈఈ లాల్ సింగ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు.

ఇటీవల దెబ్బతిన్న వరద కాల్వ మరమ్మతు పనులు పూర్తి అయినందున సబ్ కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం వల్ల పనులు నెమ్మదించినట్లు ఇరిగేషన్ ఈఈ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రి తక్షణమే ఇరు వర్గాల కాంట్రా క్టర్లతో మాట్లాడి, ఒకట్రెండు రోజుల్లో వివాదాన్ని పూర్తిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

## పరిశ్రమల నేతృత్వంలోని ఆవిష్కరణలు, అంకురాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు 'జీసీసీ కాన్‌క్లేవ్ ఆన్ ఇన్నోవేషన్ 2026'ను నిర్వహించిన ఏఐఎం, ఎస్టీపీఐ

న్యూఢిల్లీ, జులై 2:నీతి ఆయోగ్ పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ) భాగస్వామ్యంతో 'జీసీసీ కాన్‌క్లేవ్ ఆన్ ఇన్నోవేషన్ 2026' సదస్సును బెంగళూరులో నిర్వహించింది. దేశంలోని ఆవిష్కరణలు, వ్యవస్థాపక వ్యవస్థలో మరింత లోతైన భాగస్వామ్యానికి గల మార్గాలను అన్వేషించడం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) నాయకులు, పరిశోధన, అభివృద్ధి విభాగాల అధినేతలు, ఆవిష్కరణ రంగానికి చెందిన నాయకులు, స్టార్టప్ వ్యవస్థ నిర్వాహకులు, ఇంక్యుబేటర్లు, ప్రభుత్వ విధాన రూపకర్తలు హాజరయ్యారు.

ఈ సదస్సులో ఇంటెల్, ఐబీఎం, బాష్, అమెజాన్, ఎస్ఏపీ, థర్మో ఫిషర్ సైంటిఫిక్, సీజీఐ, షెల్, మెర్సిడెస్ బెంజ్, ఫిలిప్స్, మోర్గాన్ స్టాన్లీ, ఎన్విడియా, శాంసంగ్, శాన్‌డిస్క్, విప్రో, యాహూ వంటి ప్రముఖ జీసీసీలు, సాంకేతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితోపాటు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటిఎల్స్), అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాలు, అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ కేంద్రాలు, ఎస్టీపీఐ సెంటర్స్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల భాగస్వాములు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

దేశ ఆవిష్కరణల రంగానికి, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) మధ్య బలమైన సంబంధాలను ఏర్పరచడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ అందిస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా సరికొత్త అవకాశాలను అన్వేషించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలను పెంచే అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నుంచి కొత్త కంపెనీల ఏర్పాటుకు మద్దతు ఇచ్చే ఇంక్యుబేషన్ కేంద్రాల వరకు అన్ని దశల్లోనూ భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ఈ కార్యక్రమంలో చర్చించారు. వీటితోపాటు అంకుర సంస్థలను పెద్ద కంపెనీలుగా మార్చేందుకు త్వరలో రాబోతున్న పరిశ్రమల ఆధారిత యాక్సిలరేటర్ కార్యక్రమం 'యాక్సెస్' (అటల్ యాక్సిలరేషన్ సెంటర్స్ ఫర్ స్కేల్ అప్ ఆఫ్ స్టార్టప్స్) ద్వారా కలిగే ప్రయోజనాలపై కూడా చర్చించారు.

ఈ సదస్సులో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ శ్రీ అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక, ఆవిష్కరణల రంగాన్ని శక్తిమంతం చేయడంలో ఎస్టీపీఐ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే సరికొత్త ఆవిష్కరణలను ప్రపంచ మార్కెట్ స్థాయికి తీసుకెళ్లడానికి ఈ జీసీసీ సదస్సు ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

"దేశవ్యాప్తంగా 2,100కు పైగా కేంద్రాలతో భారత్ జీసీసీ వ్యవస్థ దాదాపు 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ప్రపంచ స్థాయి లక్ష్యాలకు భారతీయ ప్రతిభ తోడైతే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఇది నిరూపించింది. 1991 నుంచి ఈ ప్రయాణంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. సాంకేతిక మౌలిక సదుపాయాలు, విధానపరమైన నిర్ణయాలు, వ్యవస్థల అనుసంధానతను పటిష్టం చేయడం ద్వారా భారత్‌ను ప్రపంచ స్థాయి సామర్థ్యాల అభివృద్ధికి అత్యుత్తమ కేంద్రంగా మార్చింది. ప్రస్తుతం మేం ఈ భాగస్వామ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్టీపీఐ సాంకేతిక పార్కులు, వ్యవస్థాపక కేంద్రాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలను అటల్ ఇన్నోవేషన్ మిషన్ పరిధిలోని పాఠశాలలు, ఇంక్యుబేటర్లు, యాక్సిలరేషన్ కార్యక్రమాలతో నేరుగా అనుసంధానిస్తున్నాం. ఈ ఏకీకరణ ద్వారా జీసీసీలు భారతీయ అంకుర సంస్థలతో కలిసి కొత్త ఆవిష్కరణలు రూపొందించడానికి, సరికొత్త సాంకేతికతలను పరీక్షించడానికి, దేశ ఆవిష్కరణల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో చురుకైన పాత్ర పోషించడానికి ప్రభుత్వం మద్దతుతో కూడిన ఒక వ్యవస్థీకృత, ప్రభుత్వ మద్దతుగల వేదిక లభిస్తుంది. ఇక్కడ ఉన్న ప్రతి జీసీసీని ఈ లక్ష్యంలో భాగస్వాములు కావాలని నేను ఆహ్వానిస్తున్నాను. అందరం కలిసి అంతర్జాతీయంగా పోటీపడగల పరిశ్రమలను నిర్మిస్తూ, 'వికసిత్ భారత్ 2047' దిశగా భారత్ పయనాన్ని మరింత వేగవంతం చేద్దాం" అని తెలిపారు. ఈ సదస్సును ఉద్దేశించి నీతి ఆయోగ్ పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) మిషన్ డైరెక్టర్ దీపక్ బాగ్లా మాట్లాడుతూ.. దేశ ఆవిష్కరణల ఆధారిత వృద్ధి ప్రస్థానాన్ని రూపొందించడంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. "అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడంలో 'జై అనుసంధాన్' కీలక చోదక శక్తిగా మారాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎప్పుడూ చెబుతుంటారు. గత దశాబ్ద కాలంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10,000కి పైగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా యువ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తూ, 100కు పైగా ఇంక్యుబేటర్ల ద్వారా అంకుర సంస్థలకు, క్షేత్రస్థాయి పరిశోధకులకు అండగా నిలుస్తూ ఈ దార్శనికతను సాకారం చేసేందుకు కృషి చేస్తోంది. నేడు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు భారత్‌ను సాంకేతికత, ఇంజనీరింగ్, సరికొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా నిలబెట్టాయి. మనకున్న బలాలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకురావడం ద్వారా కొత్త ప్రతిభను పెంపొందించవచ్చు. వ్యవస్థాపకతను వేగవంతం చేయవచ్చు. పరిశ్రమల్లో నూతన విధానాల అవలంబనను ప్రోత్సహించడంతోపాటు వికసిత్ భారత్ 2047 దార్శనికతకు దోహదపడే ప్రపంచ పోటీతత్వ సంస్థలను నిర్మించవచ్చు" అని పేర్కొన్నారు.

పాఠశాల విద్యార్థులలో ఉత్సుకతను పెంపొందించడం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పోటీతత్వ సంస్థలను నిర్మించడం వరకు ఆవిష్కరణల ప్రయాణం ఎక్కడా ఆగకుండా నిరంతరాయంగా సాగడమే ఏఐఎం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దేశీయ అంకుర సంస్థలకు మార్గదర్శకత్వం అందించడం, ఆవిష్కరణల సవాళ్లను ఎదుర్కొనడం, ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టడం, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను కల్పించడం, స్టార్టప్ పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలను పెంపొందించడం ద్వారా ఏఐఎం కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా జీసీసీ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు.

ఈ సదస్సులో ఎస్టీపీఐ బెంగళూరు డైరెక్టర్ డాక్టర్ సంజయ్ త్యాగి మాట్లాడుతూ.. దేశీయ స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్ మౌలిక సదుపాయాలు, జీసీసీ వ్యవస్థల మధ్య పరస్పర సమన్వయ అవసరాన్ని వివరించారు.

"దేశంలోనే అత్యధిక సంఖ్యలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు కలిగిన నగరంగా బెంగళూరు ప్రత్యేక గుర్తింపు పొందింది. గత మూడు దశాబ్దాలుగా ఈ వ్యవస్థ అభివృద్ధిలో ఎస్టీపీఐ బెంగళూరు కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలో జీసీసీలు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి, ఆవిష్కరణలను పెంచుకోవడానికి అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను, నిబంధనల అమలు మద్దతును, ప్రభుత్వ విధానపరమైన మద్దతును ఇది అందిస్తుంది. ఈ సదస్సు ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ పరిధిలోని వివిధ ఆవిష్కరణల దశలతో జీసీసీలు నేరుగా భాగస్వామ్యం కావడానికి మేం స్పష్టమైన, ఆచరణాత్మక మార్గాలను అన్వేషిస్తున్నాం. దీనివల్ల జీసీసీ ప్రతినిధులు అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లోని యువ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించవచ్చు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాల్లోని అంకుర సంస్థలతో కలిసి కొత్త ఉత్పత్తులను సృష్టించవచ్చు. త్వరలో ప్రారంభం కాబోయే యాక్సెస్ ఇండస్ట్రియల్ యాక్సిలరేటర్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావచ్చు. దేశంలోని జీసీసీ వ్యవస్థ కేవలం తక్కువ ఖర్చుతో పనులు పూర్తి చేసే కేంద్రాల స్థాయి నుంచి నేడు సాంకేతిక అభివృద్ధి, ఉత్పత్తి ఇంజనీరింగ్, సరికొత్త ఆవిష్కరణలకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన శక్తిమంతమైన కేంద్రంగా ఎదిగింది. ఎస్టీపీఐ, ఏఐఎంల పరస్పర బలాలు, జీసీసీల అంతర్జాతీయ సామర్థ్యాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్కెట్లోకి తీసుకురావడానికి, స్టార్టప్‌లు పెద్ద కంపెనీలుగా ఎదగడానికి, పరిశ్రమల నేతృత్వంలోని వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి కొత్త మార్గాలను అన్వేషించవచ్చు. ఈ వ్యవస్థల కలయికకు పూర్తి మద్దతు ఇవ్వడానికి ఎస్టీపీఐ బెంగళూరు కట్టుబడి ఉంది. నేడు ఇక్కడ కుదిరిన భాగస్వామ్యాలు భారత్‌ను ప్రపంచంలోనే తిరుగులేని ఆవిష్కరణల రాజధానిగా నిలబెట్టడానికి సహాయపడతాయని నేను భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

ఈ సదస్సులో ఏఐఎం మద్దతిస్తున్న ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, ఇంక్యుబేటర్లతో జీసీసీలు ఏ విధంగా కలిసి పనిచేయవచ్చనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా అంకుర సంస్థలకు మార్గదర్శకత్వం అందించడం, కొత్త సాంకేతికతలను పరీక్షించడం, ప్రయోగాత్మక ప్రాజెక్టుల అమలు, సవాళ్లతో కూడిన ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించడం, మార్కెట్ అవకాశాలను కల్పించడం, నిర్దిష్ట రంగాలపై ఆధారపడిన ఉమ్మడి యాక్సిలరేటర్ కార్యక్రమాను రూపొందించడం వంటి అవకాశాలపై చర్చించారు.

ఈ చర్చల్లో ఏఐఎం త్వరలో ప్రారంభించబోయే యాక్సెస్ ఇండస్ట్రియల్ యాక్సిలరేటర్ కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వృద్ధి దశలో ఉన్న అంకుర సంస్థలు పారిశ్రామిక వాతావరణంలో తమ ఉత్పత్తులను పరీక్షించుకోవడానికి, ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టడానికి, పరిశ్రమల నిపుణుల నుంచి మార్గదర్శకత్వం పొందడానికి, తమ వ్యాపారాలను విస్తరించడానికి ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుంది. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా రూపొందించడం కోసం జీసీసీలు, ప్రముఖ పరిశ్రమలు తమ ఆలోచనలను, భాగస్వామ్య నమూనాలను పంచుకోవాలని ఏఐఎం ఆహ్వానించింది. అంకుర సంస్థల వృద్ధికి, సరికొత్త సాంకేతికతలను పరిశ్రమలు స్వీకరించడానికి తద్వారా దేశ ఆర్థిక వృద్ధికి ఎలా సహకరించవచ్చో వివరించాలని కోరింది.

దేశవ్యాప్తంగా ఉన్న ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక సంస్థలను ప్రోత్సహించడంలో ఒకరికొకరు ఏ విధంగా తోడ్పడగలమనే పరస్పర ప్రయోజనకరమైన సహకార రంగాలపై కూడా అటల్ ఇన్నోవేషన్ మిషన్, ఎస్టీపీఐ ఈ సదస్సులో లోతుగా చర్చించాయి. దేశాన్ని ప్రపంచ ఆవిష్కరణల, సాంకేతిక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ఈ సదస్సు ముగిసింది. ఇందులో భాగంగా కొత్త ఆవిష్కరణలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి భవిష్యత్తులోనూ ఇలాంటి సంయుక్త చర్చలు, భాగస్వామ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని భాగస్వామ్య పక్షాలన్నీ తీర్మానించాయి.

## ప్రతిభకు ప్రోత్సాహం.. మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు



ఖమ్మం, జులై 2:కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ముత్తవరపు రామారావు నగదు ప్రోత్సాహకాలను అందించారు. 2026 ఎస్ఎస్‌సీ పరీక్షల్లో జిల్లా టాపర్లుగా నిలిచి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు హరి, విన్ని, హరీష్‌లకు రూ.5,000 చొప్పున ప్రోత్సాహక నగదును అందజేశారు. ఈ సందర్భంగా కోదాడ మండల విద్యాధికారి ఎం.డి. సలీం షరీఫ్ రామా రావును అభినందించారు. రిటైర్డ్ హెచ్‌ఎం ముత్తవరపు రామారావు మాట్లాడుతూ విద్యా ర్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యా లను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషితో పాఠశాల కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని, భవిష్యత్తులోనూ ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తానని తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## భూ పోరాట సభకు వెళ్తుండగా ఆలేరు ఉద్యమకారుల అదుపు



నల్గొండ, జులై 2: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మలిదశ ఉద్యమకారుల భూ పోరాట సభకు హాజరయ్యేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుంచి గురువారం బయలుదేరిన పలువురు ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల అదుపులోకి తీసుకున్న వారిలో జంపాల శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి, ముదిగొండ మహేందర్, కాసగల్ల అనసూయ, మొరిగాడి ఇందిర, సీస మహేశ్వరి తదితరులు ఉన్నారు.

## భూ పోరాట సభ నేపథ్యంలో ముందస్తు అరెస్టులు



నల్గొండ, జులై 2: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మలిదశ తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాట సభ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో గురువారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తమ్మడి పద్మారావుతో పాటు ఉద్యమకారుడు చెక్క వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సభకు వెళ్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ అరెస్టులు చేసినట్లు సమాచారం.

భూ పోరాట సభ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ఆలేరు ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## వికసిత్ భారత్‌కు మార్గసూచీని సిద్ధం చేసిన 'రాష్ట్రీయ గ్రామీణ్ వికాస్ సమ్మేళన్-2026'

న్యూఢిల్లీ, జులై 2:గ్రామాల్లో పరివర్తనను తీసుకురావాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టికోణానికి అనుగుణంగా, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'రాష్ట్రీయ గ్రామీణ్ వికాస్ సమ్మేళన్' (ఆర్‌జీవీ ఎస్)-2026' ఈ నెల 29న ముగిసింది. ఈ సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్రాల సహకారం, సముదాయాలు నాయకత్వం వహించే అభివృద్ధి, సాంకేతికత చోదక శక్తిగా ఉండే పాలనల ద్వారా 'వికసిత గ్రామాలు, వికసిత భారత్' దార్శనికతకు సత్వరం ఆచరణ రూపాన్ని ఇవ్వాలని సంకల్పించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ జాతీయ సమ్మేళనంలో ప్రధాన గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలును సమీక్షించడం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య అత్యుత్తమ పద్ధతుల మార్పిడితో పాటు గ్రామీణ పరివర్తన తదుపరి దశకు మార్గసూచీపై చర్చించారు.

ఈ సమ్మేళనాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసానితో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేశ్ పాస్వాన్ పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, సీనియర్ అధికారులు, కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల నిపుణులు, రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్స్ (ఎస్ఆర్ఎల్ఎమ్)కు చెందిన ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వాములు పాలుపంచుకున్నారు.

'వీబీ-జీ రాంజీ చట్టం, 2025'ను ప్రభావవంతంగా అమలు చేయడంపై సమ్మేళనంలో ప్రధానంగా చర్చించారు. ఈ వేదిక అనేక ముఖ్య గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర సమీక్షనూ చేపట్టింది. ఆ కార్యక్రమాల్లో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్', 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన', 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్' (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎమ్), 'గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల'తో పాటు 'జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం' ఉన్నాయి.

చర్చోపచర్చలలో గ్రామీణాభివృద్ధి ప్రణాళికను పటిష్ఠపరచడం, గ్రామపంచాయతీలకు సాధికారితను కల్పించడం, మహిళల నాయకత్వంలో బతుకుతెరువు మార్గాల్ని విస్తరించడం, గ్రామీణ గృహనిర్మాణాన్నీ, సంధానాన్నీ మెరుగుపరచడంతో పాటు వాతావరణ మార్పులకు తట్టుకొని నిలిచే జీవనోపాధులను ప్రోత్సహించడం ప్రస్తావనకు వచ్చాయి. 2029 కల్లా 6 కోట్ల మంది లఖ్‌పతి దీదీ (లక్షాధికారి సోదరీమణులు)గా ఎదిగేటట్లు వారికి తోడ్పడడానికి అమలు చేయదగిన డిజిటల్ కార్యక్రమాలకు ఉద్దేశించిన మార్గసూచీని కూడా సిద్ధం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నూతన ఆవిష్కరణల నమూనాలను దేశం అంతటా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలూ ప్రస్తావనకు వచ్చాయి.

ఈ మిషన్ ప్రస్తుతం స్వయం సహాయ బృందాలు (ఎస్‌హెచ్‌జీ)గా ఏర్పడ్డ 10 కోట్ల మందికి పైగా మహిళలకు బాసటగా నిలుస్తోంది. మహిళల నాయకత్వంలోని వాణిజ్య సంస్థలకు ఊతమివ్వడానికి డీఏవై-ఎన్ ఆర్ఎల్ఎమ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమంలో వాణిజ్య సంస్థలకు ఆర్థిక సహాయం, డిజిటల్ మాధ్యమంలో నూతన ఆవిష్కరణలు, బ్రాండింగు, మార్కెట్టును అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టిని కేంద్రీకరించారు. ఈ సమ్మేళనం డీఏవై-ఎన్ఆర్ఎల్ఎమ్‌కు చెందిన జాతీయ మార్కెటింగ్ కార్యక్రమం 'సరస్ ఆజీవికా' స్థాయి విస్తరిస్తుండటాన్ని ముఖ్యంగా ప్రస్తావించింది. 1999లో ఒకటో సరస్ మేళాను ప్రారంభించిన తరువాత, ఈ కార్యక్రమం ఒక జాతీయ స్థాయి మార్కెటింగ్ విస్తారిత అనుబంధ వ్యవస్థ రూపాన్ని సంతరించుకుంది. దీనిలో 25 కన్నా ఎక్కువ రాష్ట్ర బ్రాండ్లు చేరాయి.

# భారత పర్యాటక రంగంలో డిజిటల్ ప్రచారం బలోపేతం లక్ష్యంగా గూగుల్ ఇండియాతో పర్యాటక మంత్రిత్వ శాఖ ఒప్పందం



న్యూఢిల్లీ, జులై 2:డిజిటల్ సాంకేతికతలు, కృత్రిమ మేధ, డేటా ఆధారిత అవగాహనను, సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా భారత పర్యాటక గమ్యస్థానాల డిజిటల్ ప్రచారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఈ రోజు గూగుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై ఇరు పక్షాలూ సంతకాలు చేశాయి.

పర్యాటక మంత్రిత్వ శాఖ, గూగుల్ ఇండియా మధ్య డిజిటల్ పర్యాటక ప్రోత్సాహం, జ్ఞాన భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణం, సందర్శకుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం వంటి కీలక రంగాల్లో సహకారానికి ఈ అవగాహన ఒప్పందం ఒక విధాన ప్రణాళికను రూపొందిస్తుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల్లో భారత పర్యాటక గమ్యస్థానాలు, అనుభవాలు, సాంస్కృతిక వారసత్వానికి మరింత ప్రాచుర్యం కల్పించడానికి, గూగుల్ డిజిటల్ వ్యవస్థ నైపుణ్యాలను ఈ భాగస్వామ్యం వినియోగించుకుంటుంది. ఈ సహకారం వాణిజ్యేతరమైనది, కట్టుబడి ఉండాల్సిన అవసరం లేనిది, ప్రత్యేకత లేనిది. దీనివల్ల ఇరుపక్షాలకు ఎలాంటి ఆర్థికపరమైన చిక్కులూ ఉండవు.

ఈ కార్యక్రమానికి పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ భువనేష్ కుమార్, అదనపు కార్యదర్శి-డైరెక్టర్ జనరల్ (పర్యాటకం) శ్రీ సుమన్ బిల్లా, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్-వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ప్రీతి లోబానా, గూగుల్ ఇండియా ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు భారత సాంస్కృతిక ప్రదేశాల వైభవాన్ని, గొప్పతనాన్ని ప్రదర్శించే అద్భుతమైన అనుభవాలను సృష్టించగల సామర్థ్యం డిజిటల్ సాంకేతికతలకు ఉంది. అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించుకోవడం ద్వారా, పర్యాటకులు భారత గొప్ప సాంస్కృతిక, సహజ వారసత్వాన్ని తెలుసుకునే, అనుభవించే, దానితో మమేకమయ్యే విధానాన్ని మనం మార్చేయగలం" అని వ్యాఖ్యానించారు.

'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' కార్యక్రమం కింద పర్యాటక ప్రోత్సాహానికి వినూత్నమైన, సాంకేతికత ఆధారిత విధానాలను అవలంబించాలనే మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ సహకారం ప్రతిబింబిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రపంచ పర్యాటక రంగంలో భారత్ ఉనికిని బలోపేతం చేయడానికి... డిజిటల్ ప్రచారాన్ని మెరుగుపరచడానికి... దేశాన్ని ఒక ఆధునిక, సులభంగా చేరుకోగల, ప్రపంచంతో పోటీపడగల పర్యాటక గమ్యస్థానంగా నిలపడానికి ఈ భాగస్వామ్యం సహాయపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సహకారంలో భాగంగా... ప్రపంచ పర్యాటక ధోరణులు, పర్యాటకుల ప్రవర్తన, డిజిటల్ నిమగ్నతా సరళికి సంబంధించి గూగుల్ అందించే సమాచారాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, ఆధారాల ఆధారిత పర్యాటక ప్రచార వ్యూహాలకు మద్దతు లభిస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా మరింత కచ్చితమైన, ప్రభావవంతమైన, కొలవగల ప్రచారాన్ని సాధ్యం చేయడం కోసం డిజిటల్ మార్కెటింగ్ సాధనాలు, ప్రచార మెరుగుదల, కంటెంట్ సృష్టి, కృత్రిమ మేధ సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై మంత్రిత్వ శాఖ అధికారులకు శిక్షణను, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలనూ నిర్వహించాలని ప్రణాళిక చేస్తున్నారు.

భారత పర్యాటక రంగాన్ని మెరుగుపరచడం, దేశాన్ని ప్రపంచంలోనే ప్రాధాన్య పర్యాటక గమ్యస్థానంగా ప్రోత్సహించడం, సాంకేతికత-ఆవిష్కరణలను వినియోగించుకోవడం పట్ల తమ ఉమ్మడి నిబద్ధతను పర్యాటక మంత్రిత్వ శాఖ, గూగుల్ ఇండియా పునరుద్ఘాటించాయి.

## భూభారతి రిసర్వే అవగాహన సదస్సు..



నిజామాబాద్, జులై 2:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూభారతి రీసర్వే అవగాహన సదస్సు కార్యక్రమం లో భాగంగా భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ఎంఎ. సమీర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఏడి శ్రీనివాస్ రావు, డిఎ ఆర్మూర్ డిప్యూటీ సుప్రిండెంట్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలి. భూముల రీసర్వే పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా అన్ని విధాలుగా అధికారులకు సాయాసాకారాలు అందించాలని అన్నారు. తహసిల్దార్ ఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు రెవెన్యూ అధికారులు అన్ని విధాలుగా సహకారం అందిస్తాం భూముల రీసర్వే పై సహకరించాలని కొని ఆడారు.అలాగే బాధ్యతలు స్వీకరించిన తరాణంలో మొదటిసారి బాబాపూర్ గ్రామపంచాయతీ వచ్చినా సందర్భంగా నూతన తహసిల్దార్ ఎం.కిరణ్ కుమార్ ను సర్పంచ్ సమీర్, పాలకవర్గం సభ్యులు ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ.మల్లేష్, సర్వేయర్ శ్రీనివాస్, రామచందర్, పంచాయత్ కార్యదర్శి సంతోష్, ఉప సర్పంచ్ మంద గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు, వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ఉరుకొండ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### -అలసత్వం ప్రదర్శిస్తే అధికారులపై కఠిన చర్యలు: కలెక్టర్ హెచ్చరిక



మహబూబ్‌నగర్, జులై 2:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 4న నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని ఊరుకొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గురువారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిర్మిస్తున్న హెలిప్యాడ్ పనులు, ఆలయానికి వెళ్లే మార్గం, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆలయ ఈవో, దేవస్థానం చైర్మన్, అర్చకులతో సమావేశమైన కలెక్టర్.. ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు, పూర్ణకుంభ స్వాగతం, దర్శన ఏర్పాట్లు సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆలయం వెలుపల ప్రముఖులతో ముఖ్యమంత్రి పాల్గొనే భోజన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా పరిశీలించి, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, భద్రత, వైద్య సేవలు, పార్కింగ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఊరుకొండ రైతు వేదికలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, ఏ శాఖ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. హెలిప్యాడ్ నుంచి ఆలయం వరకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అగ్నిమాపక, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రస్తుతం సాగు సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, యూరియా కొరత తలెత్తకుండా వ్యవసాయ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దేవసహాయం, అరుణ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, డీఎస్పీ, తహసీల్దార్ యూసుఫ్ అలీ, ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి, దేవస్థానం చైర్మన్ మనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరద కాలువలో వెంటనే నీటి విడుదల చేయాలి: ఎమ్మెల్యే

నిజామాబాద్, జులై 2:బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని వరద కాలువ (ఫ్లడ్ ఫ్లో కెనాల్) ద్వారా ఆయకట్టు గ్రామాల రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు. గురువారం వేల్పూర్‌లోని తన నివాసం నుంచి ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లాల్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడి వరద కాలువ మరమ్మతులు, రివర్స్ పంపింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. గాండ్లపేట్ సమీపంలో దెబ్బతిన్న కాలువ మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో మిగిలిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి నీటిని విడుదల చేయాలని సూచించారు. సబ్‌కాంట్రాక్టర్ల మధ్య వివాదంతో పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు తెలపగా, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఒకటి లేదా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

రాబోయే వారం రోజుల్లో రివర్స్ పంపింగ్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, పది రోజుల్లోపు వరద కాలువలో నీటిని విడుదల చేసేలా చర్యలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ పరిధిలోని చెరువులను నింపడంతో పాటు సాగునీటిని పొలాలకు అందించాలని సూచించారు. వరద కాలువపై ఆధారపడి వేలాది ఎకరాల్లో సాగు జరుగుతోందని, నీటి విడుదలలో జాప్యం జరిగితే వరి, పత్తి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 15.2 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోందని అధికారులు వివరించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

# హైదరాబాద్‌లోని 'సీఎస్ఐఆర్-ఐఐసీటీ' ప్రాంగణంలో 44.46 కోట్లతో హాస్టల్ నిర్మాణానికి డాక్టర్ జితేంద్ర సింగ్ శంకుస్థాపన



న్యూఢిల్లీ, జులై 2:వ్యవసాయ పరిశోధనలు-పరిశ్రమలకు మధ్య బలమైన భాగస్వామ్యం శాస్త్రవిజ్ఞాన ఆవిష్కరణలతో అధిక విలువను సృష్టించడం ద్వారా భారత ఆర్థిక వృద్ధిలో తదుపరి దశకు సారథ్యం వహిస్తాయని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర (స్వతంత్ర బాధ్యత), ప్రధాన మంత్రి కార్యాలయ, సిబ్బంది-ప్రజా సమస్యలు-పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష మంత్రిత్వ శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని 'సీఎస్ఐఆర్-ఐఐసీటీ' ప్రాంగణంలో ఈ రోజు ?44.46 కోట్లతో 200 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో హాస్టల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, నాలుగు అత్యాధునిక పరిశోధన-అభివృద్ధి కేంద్రాలను కూడా ప్రారంభించారు.

దేశ వ్యవసాయ రంగంలో అపార సామర్థ్యం ఉందని, దీన్ని ఇంకా పూర్తిస్థాయిలో మనం వినియోగించుకోవడం లేదని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ శాస్త్రవిజ్ఞాన ప్రాధాన్యాలు పంటల మెరుగుదలకే పరిమితం కావడం లేదని చెప్పారు. వ్యవసాయ వ్యర్థాలను, పంటల అవశేషాలను విలువైన ఉత్పత్తులుగా మార్చే సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పన దిశగానూ ప్రభుత్వం ప్రాముఖ్యం ఇస్తున్నదని చెప్పారు. తద్వారా రైతులు, పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు అంది వస్తున్నాయని తెలిపారు.

హైదరాబాద్‌లోని 'సీఎస్ఐ ఆర్-ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఐసీటీ) ప్రాంగణంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాల అనంతరం డాక్టర్ జితేంద్ర సింగ్ శాస్త్రవేత్తలనుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఫ్లోరోకెమికల్స్ కోసం అధునాతన పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే, సిరిపురం చేనేత సముదాయం కోసం 500 'కేఎల్‌డీ' వికేంద్రీకృత వ్యర్థజల శుద్ధి కర్మాగారాన్ని, పారిశ్రామిక రసాయనాల కోసం నిరంతర ప్రాసెసింగ్ వేదిక సహా సుస్థిర ఇంజనీరింగ్ కాంప్లెక్స్‌ను దేశానికి అంకితం చేశారు.

యువ పరిశోధకుల కోసం నివాస మౌలిక సదుపాయాల బలోపేతంలో భాగంగా 44.46 కోట్లతో హాస్టల్ సముదాయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. శాస్త్రవిజ్ఞాన నైపుణ్యాన్ని పారిశ్రామిక ఆవిష్కరణగా, ఆర్థిక విలువగా మార్చడానికి ప్రాధాన్యం పెరుగుతున్నదని ఈ సందర్భంగా అన్నారు. నేటి కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక భాగస్వామ్య సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'సీఎస్ఐఆర్-ఐఐసీటీ' డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి సహా 'సీఎస్ఐఆర్-సీసీఎంబీ' డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందికూరి, 'సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ' డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ కుమార్, 'సీఎస్ఐఆర్-నీరి' డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకట మోహన్, 'సీడీఎఫ్‌డీ' డైరెక్టర్ ప్రొఫెసర్ ఉల్లాస్ కొల్తూర్ సీతారామ్ తదితరులు కూడా హాజరయ్యారు.

పరిశోధనలను ఆర్థిక విలువగా మార్చడంలో శాస్త్రవిజ్ఞాన సంస్థలు పరిశ్రమలతో చేయి కలపడం అత్యావశ్యకమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. భాగస్వామ్యాలతో నిమిత్తం లేని ప్రయోగశాలలకు నేటి కాలంలో తావుండదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఆవిష్కరణలు, వాణిజ్యీకరణ తదితరాలను వేగిరపరచాలంటే పరిశ్రమలు, 'ఎంఎస్‌ఎంఈ'లు, అంకుర సంస్థలు, సాంకేతిక భాగస్వామ్య సంస్థలతో జోడు కట్టాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని ప్రస్తావిస్తూ- మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం నుంచి వ్యవసాయ వ్యర్థాల ఉత్పాదక వినియోగం దాకా మొత్తం విలువ వ్యవస్థలో శాస్త్రీయ పరిశోధన, విలువ జోడింపు, గ్రామీణ వ్యవస్థాపన, సుస్థిర పారిశ్రామిక వృద్ధికి కొత్త అవకాశాలు అందివస్తాయని ఆయన అన్నారు.

ఒక అద్భుత శాస్త్రవిజ్ఞాన రూపాంతరీకరణకు భారత్ ఒక సాక్ష్యంగా నిలుస్తోందని, జాతీయ ప్రగతికి కీలక చోదకాలుగా ఆవిష్కరణలు రూపొందుతున్నాయని మంత్రి అన్నారు. రక్షణ రంగ తయారీ, విమానయానం, అంతరిక్షం, సాంకేతిక రంగాలలో దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ సాంకేతికతను అనుకరించే దేశం స్థాయి నుంచి వినూత్న ఆవిష్కరణలకు రూపు దిద్దగలదిగా పురోగమిస్తోందని చెప్పారు. ఆర్థిక వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన, ప్రపంచ పోటీతత్వం దిశగా విజ్ఞాన శాస్త్రం శక్తియుత సారథిగా ఆవిర్భవిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

శాస్త్రీయ పరిశోధనలు జాతీయ ప్రాధాన్యాలకు ఉపకరిస్తూనే, పరిశ్రమలతోపాటు సమాజానికి ఆచరణాత్మక పరిష్కారాలను అందించగలవని 'సీఎస్ఐఆర్' నిరంతరం నిరూపిస్తూనే ఉన్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ కొనియాడారు. ఆహార-వ్యవసాయ వ్యర్థాల నుంచి సంపీడన బయో గ్యాస్ ఉత్పాదన, సంగ్రహిత కార్బన్ డయాక్సైడ్‌ను డైమిథైల్ ఈథర్‌గా మార్చడంలో ఈ సంస్థ ఇటీవల వినూత్న సాంకేతికతలను ఆవిష్కరించిందని గుర్తుచేశారు. కాలుష్య రహిత ఇంధనం, వర్తుల ఆర్థిక వ్యవస్థ, వ్యర్థాల నుంచి విలువైన జాతీయ వనరుల రూపకల్పన దిశగా ఇనుమడిస్తున్న భారత్ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఇటువంటి సాంకేతికతలు జాతీయ ఇంధన భద్రతను బలోపేతం చేయడమే కాకుండా పారిశ్రామిక ప్రగతికి, పర్యావరణ సుస్థిరతకు కొత్త బాటలు వేస్తాయని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లో నేడు ప్రారంభించిన ఫ్లోరోకెమికల్స్ సంబంధిత ఆధునిక పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని ఒక వ్యూహాత్మక జాతీయ ఆస్తిగా ఆయన అభివర్ణించారు. ఫ్లోరినేషన్ సాంకేతికతలో భారత దేశీయ సామర్థ్యాలను ఇది గణనీయంగా బలోపేతం చేస్తుందని చెప్పారు. అలాగే ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ -ప్రత్యేక-ఎలక్ట్రానిక్ రసాయనాలు, శీతలీకరణ-అధునాతన పదార్థాల అభివృద్ధికి కూడా తోడ్పడుతుందని మంత్రి అన్నారు. దిగుమతి పరాధీనత తగ్గడంతోపాటు రక్షణ, ఎలక్ట్రానిక్స్, అంతరిక్షం వంటి కీలక రంగాలకు మద్దతునిస్తూ సాంకేతిక స్వావలంబన సాకారంపై దేశ సంకల్పాన్ని బలోపేతం చేస్తుందని విశ్వాసం వెలిబుచ్చారు.

శాస్త్ర విజ్ఞాన, సాంకేతికత విభాగం (డీఎస్‌టీ) సహకారంతో సిరిపురం చేనేత క్లస్టర్ కోసం అభివృద్ధి చేసిన 500 కేఎల్‌డీ వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి కేంద్రం గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. శాస్త్రీయ ఆవిష్కరణలు సాంప్రదాయ పరిశ్రమలను, స్థానిక ఆర్థిక వ్యవస్థలను ప్రత్యక్షంగా బలోపేతం చేసే తీరుకు ఈ ప్రాజెక్ట్ ఒక నిదర్శనమని ఆయన అన్నారు. స్వదేశీ సాంకేతికతతో తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేసే ఈ శుద్ధి ప్రక్రియ వల్ల కాలుష్యం తగ్గుతుందని, భూగర్భ జలాల సంరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నీటిని తిరిగి ఉపయోగించుకునే వీలుంటుందని పర్యావరణహితమైన వస్త్ర ఉత్పత్తిని ఇది ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు. పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ బాధ్యత రెండూ కలిసి ముందుకు సాగొచ్చన్న విషయాన్ని ఈ ప్రాజెక్ట్ నిరూపిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

'కంటిన్యూయస్ ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్' గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ? రసాయన, ఔషధ పరిశ్రమల భవిష్యత్తుకు ఇటువంటి నిరంతర ఉత్పాదక సాంకేతికతలు దిక్సూచిగా నిలుస్తాయని అన్నారు. ఇవి భద్రతను మెరుగుపరచడమే కాకుండా ఉత్పాదకతను పెంచుతాయని, ఉత్పత్తుల్లో నాణ్యతాపరమైన స్థిరత్వాన్ని కాపాడుతూ, పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గిస్తాయని పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమలు ప్రపంచస్థాయి పోటీని తట్టుకోగల ఉత్పాదక విధానాలను అవలంబించడానికి ఈ సదుపాయం ఎంతగానో సహాయపడుతుందని మంత్రి చెప్పారు. ప్రయోగశాలల్లో జరిగే ఆవిష్కరణలను వాణిజ్యపరంగా లాభదాయకమైన సాంకేతికతలుగా మరింత వేగంగా మార్చడానికి ఇది దోహదపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

నేడు ప్రారంభించిన కార్యక్రమాల్లో 'సుస్థిర ఇంజనీరింగ్ సముదాయం' (సస్టఈసీ) భవిష్యత్తుపై అత్యంత దృష్టి సారించే ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. చక్రీయ ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ సాగిస్తున్న ప్రయాణాన్ని ఈ సదుపాయం తెలియజేస్తోందని ఆయన అన్నారు. వ్యర్థ ప్లాస్టిక్‌లు, జీవ వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, పారిశ్రామిక ఉప-ఉత్పత్తులను ఇంధనాలు, హైడ్రోజన్, అధునాతన పదార్థాలు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా ఈ సముదా ం సరికొత్త మార్గాన్ని చూపిస్తోందని పేర్కొన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు పర్యావరణ పరిరక్షణను, పారిశ్రామిక పోటీతత్వాన్ని, ఆర్థిక విలువను ఏకకాలంలో ఎలా పెంపొందించగలవో ఇది నిరూపిస్తోం దని చెప్పారు. స్వదేశీ శాస్త్రీయ పరిష్కారాల ద్వారా 'నెట్ జీరో' లక్ష్యాన్ని సాధించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇటువంటి సాంకేతిక తలు మరింత బలాన్ని చేకప్రయోగశాలల్లో జరిగే పరిశోధనలను పారిశ్రామిక వినియోగానికి అనుగుణంగా మార్చడమే ఈ నాలుగు సదుపాయాలను అనుసంధానించే ప్రధాన సూత్రమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఫ్లోరోకెమికల్స్, స్వచ్ఛ తయారీ, పర్యావరణ సాంకేతికతలు లేదా సుస్థిర ఇంజనీరింగ్ వంటి ఏ రంగంలోనైనా స్వదేశీ పరిజ్ఞానాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వీటిని ముఖ్యంగా అంకురాలు, ఎంఎస్‌ఎంఈలు, నవ పారిశ్రామికవేత్తలు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు మద్దతుగా నిలిచేలా రూపొందించినట్లు చెప్పారు. శాస్త్రీయ మానవ వనరులకు అసలైన కొలమానం కేవలం పరిశోధనా పత్రాల ప్రచురణ మాత్రమే కాదని.. ఉపాధిని సృష్టించే, భారతీయ పరిశ్రమలను బలోపేతం చేసే, సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచే సాంకేతికతలను అందించడమేనని ఆయన స్పష్టం చేశారు.

'సీఎస్ఐఆర్-ఐఐసీటీ'లో దాదాపు 70 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో కలిపి మొత్తం 90 మంది శాశ్వత సిబ్బందిని ఇటీవల నియమించుకోవడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. శాస్త్రీయ నైపుణ్యాలు కలిగిన మానవ వనరులపై పెట్టే పెట్టుబడులకు అనుగుణంగా, అంతర్జాతీయ స్థాయి పరిశోధనా మౌలిక సదుపాయాలను కూడా కల్పించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. కొత్త హాస్టల్ భవన సముదాయం గురించి ప్రస్తావిస్తూ భవిష్యత్తులో దేశానికి అవసరమైన శాస్త్రీయ నాయకులను తీర్చిదిద్దడానికి, పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి, యువ పరిశోధకులు స్వేచ్ఛగా సరికొత్త ఆవిష్కరణలు చేసే వాతావరణాన్ని సృష్టించడానికి నాణ్యమైన వసతి సౌకర్యాలు కూడా అంతే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) వంటి కార్యక్రమాలతో పాటు డీప్ టెక్నాలజీస్‌కు అందిస్తున్న విస్తృత మద్దతు ద్వారా దేశంలో ఒక సరికొత్త వ్యవస్థను ప్రభుత్వం సృష్టిస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు, అంకురాలు, పరిశ్రమలు అన్నీ కలిసికట్టుగా పనిచేస్తూ అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకోగల సాంకేతికతలను అభివృద్ధి చేస్తాయని ఆయన అన్నారు. భారతీయ ప్రయోగశాలలు ప్రపంచ శాస్త్రీయ పరిశోధనలకు నాయకత్వం వహించాలని, భారతీయ పరిశ్రమలు అత్యంత విలువైన సాంకేతికతలను ఉత్పత్తి చేయాలన్న ఆయన దేశ ఆవిష్కరణలు ప్రపంచ సవాళ్లకు సరైన పరిష్కారాలను అందించాలనేదే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

సీఎస్ఐఆర్-ఐఐసీటీ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సిబ్బందిని డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. పరిశ్రమలతో తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకులుగా నిలవాలని, ప్రయోగశాలలో పుట్టే ప్రతి అద్భుతమైన ఆవిష్కరణ మార్కెట్లోకి చేరేలా చూడాలని ఆయన వారిని కోరారు. పరిశోధనలను వ్యాపారాలుగా, వ్యాపారాలను ఆర్థిక వృద్ధిగా, ఆవిష్కరణలను సామాన్యుడి మెరుగైన జీవన ప్రమాణాలుగా మార్చడంలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ నిరంతరం అగ్రగామిగా నిలుస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. తద్వారా ప్రపంచ శాస్త్రీయ రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరుకునే ప్రయాణంలో ఈ సంస్థ తనదైన ముద్ర వేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఈనెల 4న సీఎం రేవంత్ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ పర్యటన..

### -రూ.11.5 కోట్ల అభివృద్ధి వరాలు ప్రకటించే అవకాశం

మహబూబ్‌నగర్, జులై 2: నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం ఊర్కొండపేట శివారులోని ప్రసిద్ధ శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూలై 4న సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన తొలిసారిగా ఈ ఆలయానికి రానుండటంతో భక్తులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సుమారు రూ.11.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రకటించనున్నట్లు దేవాదాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడంతో ఆలయ అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడు తుందనే ఆశాభావం భక్తుల్లో వ్యక్తమవు తోంది.

దేవాలయ అభివృద్ధిలో భాగంగా సింధూర గణపతి ఆలయ నిర్మాణానికి రూ.26 లక్షలు, కానేరు నిర్మాణానికి రూ.50 లక్షలు, భక్తుల సౌకర్యాల విస్తరణకు రూ.20 లక్షలు, నవగ్రహ మండపానికి రూ.6 లక్షలు, కేశఖండన భవనం, రెండు నీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.95 లక్షలు, సత్యనారాయణ స్వామి వ్రత మండపానికి రూ.1.20 కోట్లు, శివాలయ అభివృద్ధికి రూ.30 లక్షలు, అన్నదాన సత్రానికి రూ.70 లక్షలు, ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించనున్నట్లు సమాచారం. వీటితో పాటు ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల కల్పన, భక్తులకు అవసరమైన సదుపాయాల విస్తరణకు కూడా నిధులు వినియోగించనున్నారు.ఉర్కొండపేటలోని ఈ పురాతన దేవాలయానికి ప్రతి మంగళవారం, శనివారం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే కనీస మౌలిక సదుపాయాల కొరతతో భక్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ కారకులు రావిచెట్టు రంగారావు

నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. అప్పటి రాంకోఠిలోగల రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానాధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ, మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు.

## 1897 సంవత్సరంలో రంగారావు

కొందరు మరాఠీ మిత్రుల సహకారంతో చతుర్వేదములు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణములు, కావ్యాలు, నాటకాలు, ఇతర సంస్కృత గ్రంథాలతో కూడిన 'శ్రీ శంకర భగవద్ పూజ్య పాద గీర్వాణ మంజూష' అనే గ్రంథాలయాన్ని తమ ఇంటిలోనే నిర్వహించేవాడు. తొలుత కొంతకాలం తమ బంగళాలోనే నిర్వహించబడ్డ భాషానిలయానికి రావిచెట్టు సహధర్మచారిణి

లక్ష్మీనరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయముకి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం.

రావిచెట్టు రంగారావు (డిసెంబర్ 10, 1877 – జూలై 3, 1910) తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రముఖులు. రంగారావు 1877, డిసెంబర్ 10 న నరసింహారావు, వేంకమాంబ దంపతులకు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. ఆయన వివాహం 13వ యేట లక్ష్మీ నరసమ్మతో జరిగింది.

తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు మొత్తం రంగారావుకు సంక్రమించగా, తండ్రినుంచి సంక్రమించిన 'మున్సబుగిరి' స్వీకరించి 'మున్సబుదారు' అయ్యారు. తెలుగుతోపాటు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం భాషలు నేర్చుకున్నారు. తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం. మత, సాంఘిక, రాజకీయాల్లోనూ వారికి సరైన అవగాహన ఉండేది.

రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, పిమ్మట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. సంస్కృత భాషపై ఆయనకు ఎనలేని గౌరవం. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఆ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించబడింది. దాదాపు ఐదేండ్లపాటు కార్యదర్శిగా ఉన్నారు. ఎందరో దాతలవద్దకు వెళ్ళి చందాలు వసూలు చేసి, ఆరువందల రూపాయలు నిలువ చేశారు.

**జూలై 3... రావిచెట్టు రంగారావు వర్ధంతి**



హైదరాబాద్ లో శ్రీకృష్ణదేవరాయల పేరిట గ్రంథాలయం స్థాపించినట్టే, 1904 జనవరి 26న రాజా నాయిని వెంకటరంగారావు బహద్దూర్ సహకారంతో హనుమకొండ లో 'రాజరాజ నరేంద్ర' గ్రంథాలయాన్ని 1904 లో స్థాపించారు. ఆ గ్రంథాలయం కోసం అనేక ముద్రణాలయాలకు, గ్రంథ విక్రయ శాలలకు లేఖలు వ్రాసి అనేక గ్రంథాలు ఉచితంగా, కొన్ని సగం ధరకు, మరికొన్ని పాతికశాతం ధరకు తెప్పించి ఇచ్చారు. హనుమకొండలో బ్రిటిష్ పోస్టాఫీసు లేనందున గ్రంథాలను, పత్రికలను తమ పేరున హైదరాబాద్‌కు తెప్పించి హనుమకొండకు పంపేవారు. అంతే కాకుండా భాషా నిలయానికి స్వంత గృహవసతి కల్పించడానికి కూడా రంగారావు చాలా కృషి చేశారు.

మునగాల రాజు, కొమర్రాజు లక్ష్మణరావుల సహచర్యంతో రంగారావు మద్రాసుకు తరచూ వెళ్ళేవారు. అక్కడ 1905 లో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర్ణయించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావు పర్యవేక్షణలో ఉండగా పుస్తకాలను చందాదారులకు చేర్చడం, వ్యాపార, రవాణా కార్యక్రమాలను రంగారావు హైదరాబాద్ నుండి స్వయంగా చేపట్టారు. కుటుంబ మంతా మద్రాసుకు తరలి వెళ్లి ఆర్నెల్లపాటు అక్కడే నివసిస్తూ గ్రంథ మండలిని అభివృద్ధికి కృషి చేశారు. రావిచెట్టు స్వదేశీ ఉద్యమాన్ని బలపరిచి, స్వదేశంలో తయారైన వస్తువుల ప్రచారానికి దృఢ సంకల్పంతో పనిచేశారు.

భాషా నిలయానికి పత్రికలు, కొత్త గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృభాషాభివృద్ధి జరుగదని భావించి, భాషా నిలయానికి అనుబంధంగా ఒక పాఠశాలను నెలకొల్పి కొత్త పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం మొదలైనవి తెలుగులోనే బోధించాలని ఆలోచన చేశారు. దానితో పది, పన్నెండు వేలమంది విద్యార్థులతో ఒక పాఠశాల ప్రారంభించారు. కానీ సభ్యులు చేసిన వాగ్దానాలు ఆచరణకు నోచుకోలేదు. రంగారావు చొరవ తీసుకుని, చందాలకోసం తిరుగలవలసి వచ్చింది. విద్యార్థులకు పలకలు, బలపాలు, పుస్తకాలు కొనిచ్చారు. ఫలితం లేక ఆ పాఠశాల మూతపడి పోయింది.

లక్ష్మీ నరసమ్మ కూడా విద్యా వికాసానికి, సాంఘిక కార్యక్రమాలతో భర్తతో పాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. స్త్రీలకు కుట్టు పనులు మొదలయినవి నేర్పించి వారిలో నైపుణ్యాన్ని పెంచాలనీ విద్యాభివృద్ధి చేయుఁత లక్ష్యంతో 'ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించి లక్ష్మీనరసమ్మనే దాని మొదటి అధ్యక్షురాలుగా బాధ్యతల్ని చేపట్టారు. ప్రతి శుక్రవారం వారి ఇంట్లోనే స్త్రీ విద్య, శిశుపోషణ, గృహ నిర్వహణ, పాతివ్రత్యము, ఐకమత్యము మొదలయిన అంశాలపై ఉపన్యాస కార్య క్రమాలు నిర్వహించే వారు.

1908 సంవత్సరంలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చి హైదరాబాదు నగరాన్ని ముంచి వేయగా, ఎంతో ధన, ప్రాణనష్టం జరిగింది. ఆపద కాలంలో రంగారావు హైదరాబాద్ నగర ప్రజలకు సహాయపడి, నిరాశ్రయులైన వారికి, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరు ఎంతోమంది పేద విద్యార్థులను తన ఇంట్లో వుంచుకొని ఉన్నత చదువులు చెప్పించారు. అలా వారి సహాయంతో పైకివచ్చిన వారిలో ఆదిరాజు వీరభద్రరావు లాంటి వారు ఉన్నారు.

రావిచెట్టు రంగారావు జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావు 1910 లో 'జీవిత చరితావళి' అనే గ్రంథంలో నిక్షిప్తం చేశారు.

ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన 1911 లో ప్రచురితమైంది. మాతృభాష, గ్రంథాలయాల అభివృద్ధి కోసం, సర్వస్వము ధారపోసిన రంగారావు తన ముప్పై మూడో ఏటనే 1910 జూలై 3వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## అతి వేగంతో ఆటోను ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

### –ప్రాణాపాయ స్థితిలో ఆటో డ్రైవర్



హన్మకొండ, జులై 2:(నేటినిజం ప్రతినిధి) హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వంగపల్లి గ్రామ శివారులో ఈరోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. వంగపల్లి గ్రామం వైపు నుండి మర్రిపల్లిగూడెం వైపు వెళ్తున్న ఆటోను మరిపెల్లి గూడెం గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టగా ఈ సంఘటన జరిగినట్లు తెలిసింది.

జమ్మికుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన ఉడుత ఓదెలు అలియాస్ నితిన్( 25) అనే ఆటో డ్రైవర్ కు ఈ ఘటనలో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఆసుపత్రికి తరలించారు. అధిక ఇసుకలోడుతో అధిక స్పీడ్ తో ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

ఈ ప్రమాద విషయంలో ఎలాంటి కేసు కాకుండా ఇసుక ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణప్రయస్థితిలో ఉన్న ఆటో డ్రైవర్ ఓదెలు తరపు కుటుంబ సభ్యులకు ప్రమాదానికి గురైన ఇసుక ట్రాక్టర్ యజమానికి మధ్యన ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు రాయబారాన్ని నడిపిస్తుండగా అందుకు స్థానిక పోలీసుల సహకారం కూడా ఉన్నట్లు సమాచారం ఉంది.

## నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పైకి దూసుకెళ్లిన ట్రక్.. త్రుటిలో తప్పిన ప్రమాదం

వరంగల్, జులై 2:కాజీపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఫాతిమా సమాంతర బ్రిడ్జి పైకి అదుపు తప్పి ఓ ట్రక్కు దూసుకెళ్లిన సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన భారీ ట్రక్ హనుమకొండ వైపు నుంచి కాజీపేట వైపుకు అతివేగంగా వచ్చి, అదుపుతప్పి నిర్మాణం అవుతున్న బ్రిడ్జి పైకి దూసుకెళ్లింది.

ఆ బ్రిడ్జిపై నున్న గుంతలలో ట్రక్కు దిగబడిపోయింది. ట్రక్కు డ్రైవరు మద్యం మత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఉప్పొంగిన బొగత జలపాతం



ములుగు, జులై 2: ములుగుజిల్లాలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జలపాతంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉప్పొంగుతున్న జలసత్వళ్లు కనువిందు చేస్తున్నాయి. దీంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం



హన్మకొండ, జులై 2:(నేటినిజం ప్రతినిధి) ఓటర్ ఎన్యూమరేషన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు నర్సంపేట పట్టణ 10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని 9, 10 వార్డుల పరిధిలోని 171, 172 పోలింగ్ బూత్‌ల ఓటర్ల కోసం సంజయ్‌నగర్ పాఠశాల సమీపంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించి, ఫారాలు నింపడంలో సిబ్బంది ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కేంద్రం నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు.

ప్రతి అర్హుడైన ఓటరు ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని, ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని హన్మకొండ శ్రీధర్ కోరారు. ప్రజలకు సరైన సమాచారం అందించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు పూర్తి చేయించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ రమ, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొనగా, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## టీజేఎంయూ సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్



సంగారెడ్డి, జులై 2: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ జాతీయ మాజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్షుడిగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రకటించారు. యూనియన్ కార్యకలాపాలు, ఎన్నికలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాల్లో తోపాజి అనంత కిషన్‌తో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన యూనియన్ నాయకులకు సూచించారు.

యూనియన్ బలోపేతంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు. యూనియన్ నాయకుల విజ్ఞప్తి మేరకే ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, డివిజన్ కార్యదర్శి అంజాగౌడ్, డిపో అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి విక్రమ్, జాయింట్ సెక్రటరీ ఎం. రవి, సురేష్, హిమగిరి, వెంకటేశం, రవి, వహీద్, మల్లికార్జున, మధుకర్, విజయ, సక్కుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ అంధకారం'



నల్గొండ, జులై 2: మత్తు పదార్థాల వినియోగంతో యువత ఆరోగ్యం క్షీణించి వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందని కోదాడ ఎస్ఐ బి.సుధీర్ అన్నారు. గురువారం కోదాడ కె ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం సమాజ శ్రేయస్సుకు అత్యవసరమన్నారు. ఇందులో యువత కీలక భూమిక పోషించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం క్షీణించడంతో పాటు మానసిక దృఢత్వాన్ని కోల్పోయి నేర ప్రవృత్తికి అలవాటు పడి సంఘ విద్రోహక శక్తులుగా తయారవుతారన్నారు.

మత్తు పదార్థాలు అమ్మినా కొనుగోలు చేసినా స్వీకరించినా నేరస్తులేనని వారికి జైలు శిక్ష తప్పదన్నారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లు, పోలీస్ డ్రగ్స్ కమిటీ సభ్యులు హుస్సేన్ గౌడ్, అధ్యాపకులు నాగరాజు, పిచ్చిరెడ్డి, యాదగిరి, బల భీమారావు, రమేష్, రత్నకుమారి, వెంకన్న, రామరాజు, నరసింహారెడ్డి, మమత, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు : కలెక్టర్ ప్రతిమా సింగ్


మెదక్, (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో సంపూర్ణంగా వరి ధాన్యం కొనుగోళ్లు విజయవంతం గా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు . జిల్లా చరిత్రలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది యాసంగిలో రైతులు గతంలో కంటే 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారని వివరించారు.

జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1005.66 కోట్లను జమ చేశామన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేశామని వివరించారు.

ఏప్రిల్ 08 న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27వ తేదీకి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, పీఏసీఎస్ -305, ఐకేపీ-185, డీసీఎంఎస్- 43 కేంద్రాల ద్వారా కొనుగోలు జరిపామన్నారు.

జిల్లాలో జొన్న రైతులు ఎలాంటి ఆందోళన గురి కావద్దని, జొన్నల కొనుగోళ్ల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు. శుభ్రంగా ఉన్న జొన్నల్ని కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3,609 మంది రైతుల నుంచి 6,347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసామన్నారు.

## డాక్టర్ల సేవలు అమూల్యం - ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, జులై 2: (నేటినిజం ప్రతినిధి): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని గోకుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్య సమయంలో ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించే వైద్యులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. వైద్య వృత్తి అత్యంత గొప్పదని, సేవా దృక్పథంతో పనిచేసే డాక్టర్ల కృషిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రెజింతల్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, కొత్తకాపు శ్రీధర్ రెడ్డి, మసూద్, కొండారెడ్డి శ్రవణ్ రెడ్డి, వాజిద్, విష్ణు, జలేందర్, దిలీప్, సంగమేష్, అఖిల్, హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వామిత్ర చౌహాన్‌కు వనజీవి రామయ్య స్మారక పురస్కారం

ఖమ్మం, జులై 2:ప్రకృతికి విశేష సేవలందించిన పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో నిర్వహించిన "వనజీవి రామయ్య అవార్డు మహోత్సవం"లో బాల పర్యావరణ ప్రేమికుడు, 'మొక్కల వారసుడు'గా పేరుగాంచిన విశ్వామిత్ర చౌహాన్‌కు ప్రతిష్ఠాత్మక "వనజీవి రామయ్య స్మారక పురస్కారం" ప్రదానం చేశారు. 'వనజీవి రామయ్య' చిత్ర దర్శకుడు వేముగంటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 70 ఎకరాల అటవీని సృష్టించిన పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ చేతుల మీదుగా విశ్వామిత్ర చౌహాన్‌కు పురస్కారం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో చిన్నారి చేస్తున్న విశేష సేవలను ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు. ఈ అవార్డును భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పర్యావరణవేత్తలు మొక్కల వెంకటయ్య, 'సీడ్ మ్యాన్ ఆఫ్ ఇండియా' హరినాథ్ కూడా అందుకున్నారు. అనంతరం వనజీవి రామయ్యకు నివాళిగా హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్ ప్రాంగణంలో విశ్వామిత్ర చౌహాన్ "పింక్ పనస" మొక్కను నాటారు. ప్రకృతిని పరిరక్షించడమే వనజీవి రామయ్యకు నిజమైన నివాళి అని చౌహాన్ పేర్కొన్నాడు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.